నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల
శనివారం 8 జూన్ 2024 11 పేజీలు

## తొలకరి జల్లు కురిసింది..

# పుడమి తల్లి మురిసింది

- ❑ పల్లెల్లో మొదలైన పొలం పనులు
- ❑ నేటి నుండి మృగశిర కార్తె ఆరంభం





**సూర్య రాయికల్**

భానుడి ప్రతాపానికి విలవిల లాడుతున్న జనాలకు,తొలకరి జల్లులు తోడై వరుణ దేవుడు వర్షించడంతో,పుడమి తల్లి పులకరించి పోయింది.రోహిణి కార్తె లో భానుడు బండలు పగిలేలా ప్రకాశిస్తే,మృగశిర కార్తె ఆరంభం లోనే తొలకరి జల్లులు అదరగొట్టే.దీంతో పల్లెల్లో పొలం,వ్యవసాయ పనులు రైతులు ప్రారంభించారు.జిల్లా వ్యాప్తంగా రైతులు వానాకాలం సాగుకు శ్రీకారం చుట్టారు. మృగశిర కార్తి ఆరంభానికి ఒకరోజు ముందు నైరుతి రుతుపవనాలతో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది.దీంతో అన్నదాతలు ఉత్సాహంగా సాగుకు సమాయత్తం అవుతున్నారు.జిల్లాలోని రైతులు వివిధ పంటల సాగుకు మొగ్గు చూపడంతో,పలు మండలాల్లో విత్తనాలు విత్తేందుకు సిద్ధం అయ్యారు.మరి కొందరు రైతులు పొలాలను సిద్ధం చేసుకొని విత్తనాల కొనుగోళ్లలో అన్నదాతలు హడావిడిలో ఉన్నారు. ఓ పక్క పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు, మరోపక్క వాణిజ్య ఆహార పంటల సాగుకు రైతన్నలు పూనుకుంటున్నారు.

### రైతన్నలు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు



వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా,రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆధీకృత డీలర్ల దగ్గర విత్తనాలను కొనుగోలు చేయాలి.గ్రామాల్లో రాత్రికి రాత్రే వచ్చి విక్రయించే నకిలీ విక్రయాదారుల నుంచి ఎట్టి పరిస్థితిలో విత్తనాలు కొనుగోలు చేయరాదు.నిర్ణీత ఫార్మాట్‌లో ఉన్న రశీదు, దుకాణదారుడి అడ్రస్,పేరు,లైసెన్స్ నెంబర్, జీఎస్టీ నెంబర్ ఉన్న రశీదు మాత్రమే అంగీకరించాలి. రశీదుపైన విత్తన కంపెనీ పేరు,విత్తన రకం,లాట్ నెంబర్,గడువు తేదీ,డీలర్ సంతకం తప్పని సరిగా ఉండేలా చూసుకోవాలి.సంచుల్లో ఖాళీ గా ఉన్న, పగిలిపోయిన ప్యాకెట్లు,డబ్బాలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదు.గడువు దాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితిలో కొనరాదు. విత్తన ప్యాకెట్లపై ముద్రించిన సమాచారా న్ని,బిల్లు అయిన వాటి వివరాలను సరి చూసుకోవాలి.బీటీ కాటన్ విత్తన ప్యాకెట్లపై జీఈఏసీ అప్రూవల్ నెంబర్,తేదీ, సదరన్ జోన్,తెలంగాణ రాష్ట్రంలో సాగుకు అనువైందో? కాదో? విత్తన ప్యాకెట్లపై ఉన్న సమాచారంలో సరి చూసుకోవాలి.విత్తన (మిగతా 2లో)

### జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం

# యుద్ధ ప్రాతి పదికన బ్యారేజ్ పునరుద్ధరణ పనులు

- ■ రాష్ట్ర నీటి పారుదుల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ■ సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్‌ను సందర్శించిన మంత్రి



**సూర్య మంథని**

సుందిళ్ళ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ముమార్ రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, గుత్తేదారు ఏజెన్సీలను ఆదేశించారు.కాళేశ్వరం ప్రాజెక్టులోభాగంగా నిర్మించిన మూడు బ్యారేజ్ ల సందర్శన లో శుక్రవారం రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంథని మండలం సిరిపురం గ్రామం వద్ద నిర్మించిన సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను సందర్శించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను ఆసాంతం మంత్రి పరిశీలించి, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటుచేసి పనులు వేగవంతంచేయాలని మంత్రి అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని, ప్రతి పనికి సంబంధించి మిగతా 2లో...

# యదేచ్ఛగా అక్రమ మట్టి దందా

- ❍ అనుమతులు లేకుండా రవాణా...
- ❍ 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు..

వివరాలు 8లో...

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



# విద్యార్థులంతా సర్కారు బడిబాట పట్టాలి



- • పకడ్బందీగా కార్యక్రమం నిర్వహించాలి..
- • ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలి
- • జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ల్సాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలని, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. పద్ధతి ప్రకారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. శుక్రవారం మిగతా 2లో...

# బడిబాట పట్టే వారెందరు..!

- పిల్లలు కార్పోరేట్ బాట.. తల్లిదండ్రులు బడిబాట
- చేతులు కాలినంక..ఆకులు పట్టుకున్నట్లు



**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కాల్వ శ్రీరాంపూర్ మండలంతో పాటు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుంది. అయితే బడిబాట కార్యక్రమంపై పలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎండిన చెట్టుకు నీరు పోసి చిగురింప చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ప్రభుత్వ పాఠశాలల విద్య ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పిల్లలు కార్పొరేట్ విద్య బాట పడు తుంటే.. తల్లిదండ్రులు గ్రామాల్లో బడిబాట పట్టడం ఆశ్చర్యార్థకంగా ఉన్నట్లు పలువురు భావిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలను వారి పాఠశాలల్లో చేర్పించుకున్నాక ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట పట్టడం చేతులు కాలినంక.. ఆకులు పట్టుకున్నట్లుఉంది.

### ముందే ప్రైవేట్ యాజమాన్యం...

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఉపాధ్యాయులు గత నెల రోజుల నుంచి ఇంటింటి ప్రచారం చేస్తూ వారి పాఠశాలల వద్ద ఉన్న సౌకర్యాలు వసతులు, ఉపాధ్యాయుల సీనియార్టీ, సాధించిన ఫలితాలు తదితర కరపత్రాలతో విస్తృతంగా ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దూర ప్రాంతాల నుంచి రావడానికి పిల్లలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని కొత్తగా కంప్యూటర్ విద్య ప్రవేశపెడుతున్నామని తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. దీంతో ప్రైవేటు విద్య వైపు తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలతో పాటు కార్పొరేట్ పాఠశాలలు దగ్గరయ్యాయి. బడిబాట కార్యక్రమం తలపెట్టిన గత ఐదు ఆరు సంవత్సరాలుగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించింది నామ మాత్రమే. మూడేళ్లు నిండిన చిన్నారుల నుండి ప్రైవేటు పాఠశాలల్లో ఎల్ కే జి,యూకేజీల తో పాటు ఆయా తరగతులలో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

### బడిబాట కార్యక్రమాలు ఇలా....

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట మొదలుపెట్టిన మొదటి రోజు గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వాహకులు సమావేశమై కార్యక్రమం పై చర్చించి పిల్లలను బడిలో చేర్పిస్తామని ప్రతిజ్ఞ చేయాలి అనంతరం ర్యాలీ నిర్వహించి నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలి. రెండవ రోజు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి బడి ఈడు పిల్లలు ఉంటే ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఒప్పించాలి. పిల్లలను గుర్తించి రికార్డులో పొందపరచాలి. తర్వాత 8 ,9 ,10 తేదీల్లో ఇంటింటి ప్రచారంతో పాటు అంగన్వాడి కేంద్రాలను సందర్శించి బడికి వెళ్లే వారిని గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ బడిలో చేర్పించేలా ఒప్పించాలి. కరపత్రాలు బ్రోచర్లు తయారుచేసి ప్రభుత్వ బడిలో చేరితే ప్రయోజనాలు, వసతులు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనము, ఉచిత పుస్తకాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన మరియు సౌకర్యాలను వివరించాలి. 11న గ్రామసభ నిర్వహించి బడిబాటలో చేసిన కార్యక్రమాలు బడి బయట ఉన్న వారి వివరాలు డ్రాప్ అవుట్ ల గురించి వివరించాలి. 11 లోగా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 12న బడి ప్రారంభోత్సవం సందర్భంగా అలంకరణతో స్వాగతం పలకాలి.

### -ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల పిల్లలు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించితే బడిబాట కార్యక్రమాలు అవసరమే లేదని పలువురు పేర్కొంటున్నారు. అధికారుల, ప్రభుత్వ ఉపాధ్యాయుల, ప్రజా ప్రతినిధుల పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించితే గ్రామాల్లో తల్లిదండ్రులు వారిని చూసి ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పిల్లలను ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించినంతవరకు బడిబాట కార్యక్రమాలు విజయవంతం కాబోవని పలువురు భావిస్తున్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బాగుపడాలంటే ప్రభుత్వం తక్షణమే అధికారుల, ఉపాధ్యాయుల, ప్రజా ప్రతినిధుల పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఆదేశాలు జారి చేయాలని పలువురు కోరుతున్నారు.

## ఈ నెల 10వ తేదీన సదరం స్లాట్ బుకింగ్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఈ నెల 10వ తేదీన సదరం స్లాట్ బుకింగ్ మీ సేవ ద్వారా చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపారు.

## మాచనపల్లిలో బడిబాట

**సూర్య, జమ్మికుంట రూరల్**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. అందులో భాగంగా బడిబాట కార్యక్రమం ఈనెల 6 నుండి ప్రారంభించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జమ్మికుంట మండలంలోని మాచనపల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బృందం ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు బోధిస్తున్న నాణ్యమైన విద్యను గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఆటలు ఆడుకోవడానికి క్రీడా పరికరాలు అన్ని వసతులు విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. రూ. లక్షలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలో చదివించడం కన్నా అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలని వారు కోరారు. ఎస్సీ కాలనీలోని నలుగురు విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చి పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఏబూసి శ్రీనివాస్, ఉపాధ్యాయుల బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## పంట రుణం సమయంలో ప్రమాద భీమా చేయించాలి

**సూర్య, వీణవంక**



వ్యవసాయ పంట రుణాలు తీసుకునే సమయంలో ప్రతి రైతు ప్రమాద భీమా పథకాన్ని తీసుకొని సద్వినియోగం చేసు కోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ రీజియన్ డీజీఎం డి. అపర్ణ రెడ్డి తెలిపారు. ప్రమాద భీమా ఉండడం వల్ల వ్యవసాయ పంట రుణం తీసుకున్న రైతు ప్రమాదవశాత్తు మృతి చెందితే ప్రమాద భీమా పథకం కింద రూ. 5 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. వీణవంక మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ముదిగంటి రాజిరెడ్డి అనే రైతు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చల్లూరు బ్రాంచ్ లో వ్యవసాయ పంట రుణం కింద రూ.1.60 లక్షల రుణం తీసుకున్నారు. రుణం తీసుకున్న రైతు రాజిరెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. చనిపోయిన రైతు రాజిరెడ్డి బ్యాంకులో వ్యవసాయ రుణం తీసుకోవడంతో పాటు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ లో ప్రమాద భీమా కింద 1,499 రూపాయల ప్రీమియం చెల్లించి ఉన్నందున బ్యాంకు వారు పూర్తి వివరాలను సేకరించి శ్రీశైలం కుటుంబానికి రూ. 5 లక్షల ప్రమాద భీమా మంజూరు చేశారు. రైతు కుటుంబానికి ప్రమాద భీమా కింద మంజూరు అయిన ఐదు లక్షల చెక్కును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ రీజినల్ మేనేజర్ డి. అపర్ణ రెడ్డి, స్థానిక బ్యాంకు మేనేజర్ దేవేందర్ రెడ్డి, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ ఈరు రాజు శుక్రవారం చల్లూరు బ్రాంచ్ లో అందజేశారు. అగ్రికల్చర్ లోన్ కింద ఉన్న రూ. లక్ష 60 వేల బకాయిని జమ చేసుకొని మిగతా మూడున్నర లక్షలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తామని మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం రూ..1కోటి 9లక్షల 62.169

**సూర్య మల్యాల**



ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్ర వారం 34 రోజులగాను ఉండి లెక్కిం పు చేపట్టారు నగదు రూ..1 కోటి 9 లక్షల 62 వేల69 బంగారం 44 గ్రాములు వెండి 3 కిలోల 800 గ్రాములు విదేశీ కరెన్సీ నోట్లు 41 భక్తులు సమర్పించుకున్నట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వై అంజయ్య సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ చంద్రశేఖర్ శ్రీ లలిత సేవాట్రస్ట్ సభ్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ, బడిబాట కార్యక్రమాలపై అవగాహన సదస్సు

**సూర్య, చొప్పదండి**



మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చిలుక రవీందర్ అధ్వర్యం లో మిషన్ భగీరథ పై ఇంటింటి సర్వే, బడిబాట కార్యక్రమము పై అవగాహన సధస్సు నిర్వహించారు .ఈ కార్యక్రమాలను ఉద్దేశించి అద్యక్షులు చిలుక రవీందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం లో ప్రస్తుతం ప్రతి ఇంటికి నీరందుతుందా,కొత్త కనెక్షన్లు అవసరమున్నాయ అనే విషయమై గ్రామ కార్యదర్శుల నేతృత్వంలో ఇంటిం టి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లల డ్రాపౌట్ లేకుండా, బడి బయట పిల్లలని,నూతనంగా బడిలో చేర్చే పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్చారని పిల్లలకు,వారి తల్లితండ్రులకు అవగాహన కల్పిస్థూ ఈ కార్యక్రమాన్ని జూన్ 19 వరకు కొనసాగించాలనీ సూచించారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ వేణుగోపాలరావు,ఎంపిఓ రాజగోపాలరెడ్డి, ఎస్బిఎం వేణు ప్రసాద్,ఐసిడిఎస్ సూపర్వైజర్ రామాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం పాఠశాలలో పిల్లలను చేర్పించండి

**సూర్య, హుజురాబాద్**

ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యార్థులను తల్లిదండ్రులు చేర్పించాలని తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి. ముజాహిద్ హుస్సేన్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ పట్టణంలో ఉర్దూ మీడియం పాఠశాల ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, దానిలో పిల్లల్ని చేర్పించాలని, మైనార్టీ గురుకులాల్లో కూడా పిల్లల్ని చేర్పించవచ్చని ఆయన సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ మండల పరిధిలోని పెద్ద పాపయ్యపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 8వ తేదీ శనివారం రోజున మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ వీరాచారి తెలిపారు. పెద్ద పాపయ్యపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని కాట్రపల్లి, కేసీ క్యాంపు, పెద్ద పాపయ్య పల్లి, ఇప్పల నర్సింగాపూర్, దమ్మక్కపేట, ఇండస్ట్రియల్ ఎక్స్ ప్రెస్ ఏరియాలో ఉదయం 10 నుండి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తున్న వ్యక్తి పై కేసు

**సూర్య, హుజురాబాద్ రూరల్**



అనుమతులు లేకుండా రైతులకు విత్తనాలు విక్రయిస్తున్న మేడ్చల్ కు చెందిన శాంభవి అగ్రి సీడ్స్ ప్రతినిధి రాచపల్లి లింగయ్య పై కేసు నమోదు చేసినట్లు హుజురాబాద్ టౌన్ సిఐ బొల్లం రమేష్ తెలిపారు. మండలంలో అనుమతులు లేకుండా లింగయ్య రైతులకు 20 కిలోల విత్తనాల 141 బస్తాలను విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా సమాచారం మేరకు అతనిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ ఏడిఏ గుండా సునీత, ఏవో సిహెచ్. సునీల్ కుమార్ రెడ్డి లు సైతం సంఘటన స్థలానికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారని ఆయన తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు, 14 మందికి జరిమానా

**సూర్య, హుజురాబాద్.**

హుజురాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారికి శుక్రవారం హుజురాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయి శ్రీ 14 మందికి 9,540 రూపాయల జరిమానా విధించారని, రాజు అనే వ్యక్తికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు హుజరాబాద్ టౌన్ సిఐ బొల్లం రమేష్ తెలిపారు.

## రెమ్యునరేషన్ విధానాన్ని మార్చాలని అధ్యాపకుల నిరసన

**సూర్య జగిత్యాల**



ఇంటర్మీడియట్ వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల్లో విధులు నిర్వహించే సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించే విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. రెండు సంవత్సరాల క్రితం వరకు పరీక్షల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి పారితోషకాన్ని వెంటనే అందించే వారని, అనంతరం సిబ్బంది బ్యాంక్ అకౌంట్ కి ఆన్లైన్ ద్వారా పేమెంట్ చేసే పద్ధతిని తీసుకువచ్చారని, దీని వలన రెమ్యూనరేషన్ చేతికి అందడం నెలల తరబడి ఆలస్యమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పారితోషకం అందకపోవడంతో ప్రైవేట్, గెస్ట్ ఫ్యాకల్టీ సిబ్బంది అవస్థలు పడుతున్నారని రెమ్యూనరేషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పాత పద్ధతిలో రెమ్యూనరేషన్ అందించాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం క్యాంపు అధికారి బి.నారాయణ కు వినతి పత్రాన్ని సంఘ నాయకులు అందించారు. కార్యక్రమంలో టిజిజేఎల్ఏ -475 జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్, కోశాధికారి చలిమల జయపాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రచన, స్టేట్ కౌన్సిలర్లు కంకణాల శ్రీనివాస్, కాశవేణి శ్రీనివాస్, సంఘ నాయకులు శ్రీహరి, వంశీకృష్ణ, చంద్రశేఖర్, సంతోష్, ప్రసాద్, రమేష్, రతన్ సింగ్, నరసింగం, శ్రీకాంత్, వై. శ్రీనివాస్, భాస్కర్, సుమన్, బాలకృష్ణ రెడ్డి, అనిల్, చంద్రశేఖర్, ప్రశాంత్, శ్రీలత, మాధవి, సునీత, శిల్ప, క్రాంతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన ప్రభుత్వ విప్ అడ్లూరి

**సూర్య ధర్మపురి**



తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్, ఫుడ్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లు కాలేశ్వరం మేడిగడ్డ బ్యారేజీని శుక్రవారం పరిశీలించారు..ముందుగా రాష్ట్ర మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిని లక్ష్మణ్ కుమార్, జీవన్ రెడ్డి, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లు ఉత్తంకుమార్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**సూర్య మల్లాపూర్**



కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు రజిని దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయ కులు స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎలాల జలపతి రెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఎస్ సి సెల్ మండల అధ్యక్షుడు కోంపల్లి రాకేష్, ప్రధానకార్యదర్శి కడకుంట్ల సాయికుమార్, రేగుంట ఎంపిటీసి గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి,ఆనంద్ గౌడ్, రఘు, మల్లయ్య, నర్సయ్య,బాపు రెడ్డి, మహిపాల్, సదానందచారి,

## జువ్వాడిపెళ్లిరోజు వేడుకలు

**సూర్య -కోరుట్ల**



కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నరసింగరావు రజని దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జువ్వాడి భవన్ లో ఘనంగా వేడుకలు నిర్వహించారు .సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వడికృష్ణారావు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్య నారాయణ, మ్యాకల నర్సయ్య ,ఎంబేరి సత్యనారాయణ ,రిజ్వాన్, ముల్క ప్రసాద్ ,గుంటుక రాజు, తెడ్డు విజయ్, ఏ ఆర్ అక్బర్, తుపాకుల బాజన్న, గంగధారి రమేష్ ,గంగధారి చంద్రశేఖర్, చిట్యాల సందీప్ ,ఎం డి సబీల్, పిన్నంశెట్టి మధుసూదన్ , మాజీ సర్పంచ్ పూదరి నరసయ్య ,ప్రసాద్ ,తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని నిరాశ్రయులకు కాంగ్రెస్ నాయకులు చిట్మెల్లి రంజిత్ గుప్తా ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

## రోగులకు పండ్లు పంపిణీ చేసిన జెడ్పీటీసీ

**సూర్య కథలాపూర్**



మండల జెడ్పిటీసీ నాగం భూమయ్య తన పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రభుత్వ దావఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందుమండల కేంద్రంలో శుక్రవారం జెడ్పీటీసీ పుట్టిన రోజు వేడుకలను మండల బారాస నాయకులు కేకు కోసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దవాఖాన లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యురాలు సౌజన్య, వైద్య సిబ్బంది జెడ్పిటీసీని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి, వైస్ ఎంపిపి కిరణ్ రావు, ఎంపీటీసీలు కొండ ఆంజనే యులు, మల్యాల రమేశ్ గౌడ్, కో - అప్షన్ సభ్యుడు రఫీ, మాజీ ఎంపిపి నాంపల్లి లింబాద్రి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు వర్ధినేని నాగేశ్వర్ రావు, గుండారపు గంగాధర్, గంట మాహేష్, భారాస సినియర్ నాయకులు చీటి విద్యాసాగర్ రావు, మిర్యాల వేంకటేశ్వర రావు, చుక్క దేవరాజం, రాయికంటి శేఖర్, నల్ల గంగాధర్, సబ్బని గంగు, చెక్కపల్లి రాజ్ కుమార్, కల్లెడ శంకర్, ఎజిబి మహేందర్, బాల్క సంజీవ్ తదితరులు ఉన్నారు.

## ప్రీ స్కూల్ వయస్సు పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలి

### -ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి

**సూర్య జగిత్యాల**



జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో మంగలిగడ్డ అర్బన్ 3 సెక్టార్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం బడిబాట కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా సుపర్వైజర్ స్వరూప రాణి మాట్లాడుతూ రెండు ఏళ్ల పిల్లల నుండి 5 ఏళ్ల లోపు ప్రీస్కూల్ వయసు పిల్లలందరిని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ బుక్స్ ఎల్ కే జీ, యూ కే జీ బుక్స్ ప్లే మెటీరియల్ ఉంటుందని, ఆటపాటలతో విద్య పిల్లలు నేర్చుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులతో ప్రతిజ్ఞ, ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో సఖీ సెంటర్, 181 టోల్ ఫ్రీ నంబర్ వారి సేవల గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ విజయలక్ష్మి, సాజిదా జరిన్, అతియా బాను, రిజ్వానా, ప్రీస్కూల్ పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసిన ఆత్మీయ సమ్మేళనం


**సూర్య, రాయికల్**




రాయికల్ మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించి,జ్ఞాపికను అందజేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరడంతో,పాఠశాల ఆవరణమంతా సందడిగా నెలకొంది.కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు ప్రసంగిస్తూ ఇకనుంచి అందరూ కలిసి ఉండాలని,జీవితం లో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా ఒక్కరికొకరు సహకరించుకుంటూ,జీవితం లో అత్యు న్నత స్థానానికి చేరుకోవాలని,ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తల్లిదండ్రులను వదలకూడదని, సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకోవాలని తెలిపారు.అనంతరం అందరు కలిసి సహపంక్తి భోజనం చేసి,తదుపరి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు శ్రీపతి రాఘవులు,పడాల తిరుపతి,దుంపేట జగన్,కొల్లూరి రాజేందర్, ఎద్దండి రమేష్,ముక్కెర శేఖర్,బొల్లె చిన్నయ్య,శ్రీనివాస్, ఆకుల రమేష్, జక్కుల రాజేంద్ర ప్రసాద్, కోటేశ్వరరావు, భూపాల్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## బి.సి.జి.టీకాపై అవగాహన,శిక్షణా కార్యక్రమం

**సూర్య, రాయికల్**



రాయికల్ పట్టణంలోని మార్కండేయ దేవాలయం కళ్యాణ మండపంలో ఏ.ఎన్.ఎం.లకు,ఆశా కార్యకర్తలకు,అంగన్వాడీ టీచర్లకు క్షయవ్యాధి పై అవగాహన,క్షయవ్యాధి నివారణ టీకా అయిన బి.సి.జి. టీకా పై శిక్షణా కార్యక్రమంను మండల వైద్యాధికారి డాక్టర్ కస్తూరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయవ్యాధి నుండి రోగనిరోధక శక్తి కలిగించుటకు నిబంధనల మేరకు సూచించిన అర్హులైన పెద్దవారికి బి.సి.జి. టీకా ఇవ్వాలని తెలిపారు. ఇందుకొరకు మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి బిసి జి టీకా లబ్ధిదారులను గుర్తించి, నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు గుర్తించిన పెద్ద వారికి మాత్రమే ఈ టీకా వేయటం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ టీకా వల్ల పెద్దలలో సైతం క్షయవ్యాధి రాకుండా కాపాడవచ్చునని, ముఖ్యంగా క్షయ(టిబి) రావడానికి అధిక ప్రమాదం ఉన్న వ్యక్తులకు బి.సి.జి. టీకా చాలా ఉపయోగపడుతుందని,ప్రజలందరూ ఇట్టి సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అన్నారు.ఇట్టి కార్యక్రమంలో మండల విస్తీర్ణతాధికారి ఎం.శ్రీనివాస్,ఆరోగ్య పర్యవేక్షకులు టి.శ్రీధర్, ఎం ఎల్ హెచ్ పి లు డా.వినోద్ కుమార్, రాహుల్,ఝాన్సీ,మౌనిక, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్ భూమయ్య, పవన్, వివిధ గ్రామాల ఏఎన్ఎంలు అంగన్వాడి ఉపాధ్యాయులు,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



# సూర్య

www.suryaa.com

పెద్దపల్లి

శనివారం 8 జూన్ 2024 5


# ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు

**– ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు.**
**– పెద్దపల్లి డీఈఓ మాధవి**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో పాటు ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని పెద్దపల్లి డీఈఓ డి. మాధవి కోరారు. శుక్రవారం ఆమె కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీడీవో, ఎంఈఓ, ఎంఎన్ఓలతో కలిసి కాలినడకన ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఫ్లెక్సీలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వ విద్యా సౌకర్యాలను వివరించారు. అనంతరం ఎస్సీ కాలనీ ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం కలిగిన అధ్యాపకుల చేత శాస్త్రీయ విద్యా విధానంలో బోధన చేయిస్తున్నామని, బడీడు కలిగిన పిల్లల్ని అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ



పాఠశాలల్లో చేర్పించాలని డీఈఓ కోరారు. పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై మోజు వీడాలని, ఫీజుల రూపంలో చెల్లించే డబ్బును పిల్లల పేరు మీద ఫిక్స్డ్ డిపాజిట్ చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, దానికి ఉదాహరణ తామేనన్నారు. అన్ని హంగులతో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించి, ఉచితంగా నాణ్యమైన విద్యా సౌకర్యాలను పొందాలని పిల్లల తల్లిదండ్రుల్ని డీఈఓ కోరారు. అనంతరం ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఏటా కోట్లాది రూపాయల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల్ని అందంగా, ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు చదువులో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఉన్న ఊరు కన్నతల్లి లాంటి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించి వాటిని బలోపేతం చేయాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. ఎంఈఓ టి. సురేందర్ కుమార్, ఎంఎన్ఓ సిరిమల్ల మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రజల సొమ్ముతో నడుస్తున్నాయని, గ్రామంలోని బడీడు పిల్లలందరినీ సమీపంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రుల్ని కోరారు. కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ స్పెషల్ ఆఫీసర్ గోవర్ధన్, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు నరేడ్ల సునీత, ఈర్ల సమ్మయ్య, అల్లూరి రవీందర్, ఏపీఎం కనుకయ్య, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఐకెపి సీసీలు, వివో అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు, మధ్యాహ్న భోజన వర్కర్లు, విద్యార్థినీ, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పలువురు పాల్గొన్నారు.

## డీజిల్ బూజర్ టాప్ లోడింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన ఆపరేషన్స్ డైరెక్టర్

**సూర్య సెంటినరీ కాలనీ**



సింగరేణి అర్జీ-3 ఏరియా ఓసీపీ-1 సైట్ ఆఫీస్ నందు గల ఇండియన్ ఆయిల్ బంక్ (ఐఓసీఎల్)లో శుక్రవారం డీజిల్ బూజర్ టాప్ లోడింగ్ సౌకర్యాన్ని డైరెక్టర్ (ఆపరేషన్స్ అండ్ పా) ఎన్.వి.కె శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్.వి.కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ డీజిల్ బంక్ సామర్థ్యం 119 కిలో లీటర్ల నుంచి 154 కిలో లీటర్ లకు పెంచుతూ నూతన సాంకేతికత ను జోడించి టాప్ లోడింగ్ సౌకర్యం కల్పించడం జరిగింది. తద్వారా నిమిషానికి 60 నుంచి 70 లీటర్ల ఫిల్లింగ్ సామర్థ్యం నుండి 300 లీటర్ల సామర్థ్యానికి పెంచడం జరిగిందని పేర్కొన్నారు. అదే విధంగా పెట్రోలియం %ఽ% పేలుడు పదార్థాలు భద్రతా సంస్థ అనుమతిని పొందిదని తెలియజేసారు. అనంతరం వ్యూ-పాయింట్ ని సందర్శించి కొత్తగా ప్రారంభం కానున్న రామగుండం కోల్ మైన్ ఓసీపీ-1 ఎక్స్-ప్యాన్షన్ కొరకు ప్రతిపాదనలు సర్వే చేసిన ఏరియాని మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఓసీపీ-1 ప్రొడక్షన్ స్థితి గతులను, నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో తీసుకోవలసిన చర్యలు, యంత్రాల వినియోగం,వాటి పనితీరు మొదలగు అంశాలపై చర్చించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. గనికి నిర్దేశించిన ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సాధించడానికి తగిన చర్యలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఓసీ ఎల్ సీజీఎం కమల్ షీల్, ఆర్.జీ -3 ఏరియా జీ.ఎం నరేంద్ర సుధాకర రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ నలజాల రాధాకృష్ణ, పిఈ ఆర్. శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్ హరిజన్, స్టోర్స్ డిజిఎం ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో కోడ్ విడింది...బదిలీలకు రంగం సిద్ధం

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో అధికారుల బదిలీలకు రంగం సిద్ధం అయింది. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కోడ్ ఉండడంతో గత మూడు నెలలుగా ఎలాంటి బదిలీలు జరుగలేదు. వేసవి కాలంలో ఖచ్చితంగా సింగరేణి లో బదిలీలు జరుగుతాయి. ఈ క్రమంలో నూతనంగా నియమించబడ్డ సిఅండ్ఎండి నేనావత్ బలరాం నాయక్ ఆధ్వర్యంలో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉంది. సోమవారం నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో పలువురు అధికారులు తాము అనుకున్న చోటికి బదిలీ కొరకు అధికార పార్టీ నాయకుల పైరవీలు పట్టినట్లు తెలిసింది.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**సూర్య ముత్తారం**



ముత్తారం మండలం లక్కారం గ్రామంలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 ఎస్ ఎస్ సి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 18 సంవత్సరాల క్రితం తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువుల చిరునామాలు సేకరించి ఒకే వేదిక పై వారిని ఏకం చేసి స్వాగతం పలికారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరువేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాల తీపి గుర్తులను, తమ అనుబంధాలను స్మరించుకున్నారు. విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల విషయాల గురించి ఒకరినొకరు చెప్పుకుంటూ, సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. పూర్వ విద్యార్థులు అధ్యాపకులకు శాలువాలతో, మెమొంటోస్ తో ఘనంగా సన్మానించారు. 18 సంవత్సరాల తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిర పడినటువంటి మిత్రులందరిని ఒకే చోటికి చేర్చినటువంటి పూర్వ విద్యార్థులు బర్ల జ్యోతి, లావణ్య, కోమలత, శ్రీలత, సంధ్య, తిరుమల, రజిత, శైలజ, స్వరూప, కవిత, కుమార్, శ్రీనివాస్, రాజు, సతీష్, శ్రీను, రూపేష్, నాగరాజు, నరేష్, మహేష్, రవీందర్, ప్రభాకర్, స్వామి, పోశాలు, ప్రసాద్, రమేష్, శ్రీనివాస్ లను అధ్యాపకులతో పాటు పూర్వ విద్యార్థులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి మాట్లాడుతూ పాఠశాల అధ్యాపకులను శంకర్ లింగం, చంద్రయ్య, బర్ల శ్రీనివాస్, విజయలక్ష్మి గురువులను గత 18 సంవత్సరాల క్రితం పదవ తరగతి విద్యను బోధించిన తమను గుర్తు పెట్టుకుని ఆప్యాయంగా ఆహ్వానించడం గొప్ప విషయమని అన్నారు. వారి వద్ద క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించిన విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఇతర బిజినెస్ రంగాలలో స్థిరపడి మరి కొంతమందికి సహాయం చేసే స్థాయికి అడిగినందుకు వారిని అభినందించారు.

## చినుకు పడిన., కొమ్మ ఊగిన కరెంట్ కట్

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామంతో పాటు పలు గ్రామాల్లో చినుకు పడిన, చెట్టు కొమ్మ ఊగిన కరెంట్ కట్ కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల నుండి గంగారం గ్రామంలో పగలనకా, రాత్రనకా ఎప్పుడు చినుకుపాటి వర్షం పడిన, చిన్నపాటి ఈదురుగాలి వచ్చిన కరెంట్ కట్ అవుతుంది.గ్రామంలో ప్రజలంతా వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చి సేదా తీరుదామనే సమయంలో కరెంట్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. సుమారు రోజుకు కనీసం ఎనిమిది నుండి పది మార్లు కరెంట్ కట్ అవుతుందని,సంబంధిత అధికారులకు ఎన్ని మార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోని కరెంటు సమస్య తీర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## బడి మీదే.. భాధ్యత మీదే..

**సూర్య-పెద్దపల్లి టౌన్**



తెలంగాణ రాష్ట్రం లో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ భాధ్యతలు స్వయం సహాయక బృందల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించడం జరిగిందని పెద్దపల్లి క్లస్టర్ సీఆర్పీ బాలసాని వెంకటేశం పేర్కొన్నాడు. పెద్దపల్లి పట్టణం లోని సాగర్ రోడ్ లో నిర్వహించిన బడిబాట కార్యక్రమం లో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను విద్యార్థుల తల్లి దండ్రులకు వివరిస్తూ, ప్రభుత్వ బడులు మీవేనని ఇకనుండి పర్యవేక్షణ భద్యత మీదేనని వివరించాడు. ఈ కార్యక్రమంలో కామన్ రోడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంజుల వాణి, స్రవంతి, కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లో 'కొంగల' కోలాహలం

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షా కాలం ప్రారంభం అవ్వడంతో పంట పొలాలలోకి నీటిని వదులు తున్నారు. పొలం కౌలు చేయడానికి ముందుగా భూమిని తడి చేస్తారు.ఈ క్రమంలో పొలాల్లో నీరు చేరడంతో కొంగలు, పక్షులు పొలాల్లో క్రిమి కీటకాలను తింటూ గుంపులు గుంపులుగా కానవస్తున్నాయి.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సూర్య జూలపల్లి**

నేడు ఉ,9:00 గ,,లనుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జూలపల్లి,కాచాపూర్,తెలుకుంట,విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మత్తులు నిర్వహిస్తున్న సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వినియోగదారులు గమనించి విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయానికి సహకరించాలని అదనపు సహాయక ఇంజనీర్ కోరారు.

## స్టేట్ ఛాంపియన్షిప్ అండర్-16 లో సిల్వర్ మెడల్ సాధించిన ఆనంది

**సూర్య, సెంటినరీ కాలనీ**



హన్మకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన 10వ తెలంగాణ స్టేట్ యూత్ బాయ్స్ అండ్ గర్ల్స్ స్టేట్ ఛాంపియన్షిప్ అండర్-16 400 విభాగం ఆటల పోటీలలో కమాన్పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి భారతి-శంకర్ ల కూతురు నల్లవెల్లి ఆనంది సిల్వర్ మెడల్ సాధించింది. తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి చేతుల మీదుగా సిల్వర్ మెడల్ మెరిట్ సర్టిఫికెట్ అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దపెల్లి జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి గట్టయ్య ఆనంది నీ అభినందించారు.

# మోడీ మోసాలపై నిరంతరం పోరాడుతాం..

- దేశంలో మోడీ ఇమేజ్ తగ్గింది..
- యువశక్తిని నిర్వీర్యం చేసిన బీజేపీ..
- కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేశాం..
- కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలందరికి కృతజ్ఞతలు..
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు

**సూర్య-పెద్దపల్లి టౌన్**

నరేంద్ర మోడీ మోసాలపై కాంగ్రెస్ ఆద్వర్యంలో ప్రజల పక్షాన పోరాడుతామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. పెద్దపల్లిలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. 10ఏళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజలకు ప్రధానిగా మోడీ ఏం చేశారని ప్రశ్నించారు. ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ యువతను మోసం చేశారని విమర్శించారు. యువశక్తిని నిర్వీర్యం చేసిన బీజేపీకి దేశంలో ఆదరణ తగ్గిందని అన్నారు. రాహుల్ గాంధీ యాత్ర ద్వారా చేసిన పోరాటం ఫలించిందన్నారు. రాహుల్ భావి భారత ప్రధాని కావడం ఖాయమన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు బీజేపీ అయోధ్య రామ మందిరం నిర్మాణం, అక్షింతల పేరిట ప్రజలను మతం పేరుతో ఆకర్షించేందుకు కుట్ర చేసి లబ్ధి పొందారని దుయ్యబట్టారు. ప్రధానిగా మోడీ దేశ ప్రజలకు చేసిన మేలు ఏంటిదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీ ఆర్ ఎస్ పూర్తిగా ఉనికిని కోల్పోయిందన్నారు.



పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి ప్రజలు మద్దతు తెలిపారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామిని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. పెద్దపల్లిలో త్వరలోనే బైపాస్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు తెచ్చి భూసేకరణ, రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

**కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేశాం.**

ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 165 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 27762 మంది రైతుల నుంచి రూ. 392.26 కోట్ల విలువ చేసే 17,87,101 క్వింటాళ్ల ధాన్యం కొన్నట్లు ప్రకటించారు. కొన్న 3 రోజుల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఇప్పటివరకు 26,852మంది రైతులకు రూ . 364.33 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. నూరు శాతం కొనుగోళ్లు పూర్తి చేసి 93 శాతం చెల్లింపులు చేశామన్నారు. గృహవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకెళ్ళేలా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీ గెలుపుకు సహకరించిన ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ వంశీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో భూషనవేని సురేష్ గౌడ్, కడార్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ బండారి రాంమూర్తి, గోపగాని సారయ్య గౌడ్, నూగిల్ల మల్లయ్య, భుతగడ్డ సంపత్, సయ్యద్ మాస్రత్, సందనవీని రాజేందర్, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, చిలుక సతీష్, సింగిల్ విండో చైర్మన్లు ఆళ్ళ సుమన్ రెడ్డి, మాదిరెడ్డి నర్సింగ్ రెడ్డి, చింతపండు సంపత్, శ్రీగిరి శ్రీనివాస్, శాయిరి మహేందర్, వెగోలపు అబ్బయ్య గౌడ్, గండు సంజీవ్, ఎండీ. సర్వర్, పాగల శ్రీకాంత్, ఎరుకల రమేష్, తూముల సుభాష్ రావు, బొద్దుపల్లి శ్రీనివాస్, జగదీష్, తాండ్ర శ్రీమాన్, ఉప్పు రాజు, ఈర్ల స్వరూప, దేవరకొండ రాజు, అశ్లాం, అజ్గార్, రేగుంట అశోక్ గౌడ్, ఆర్కుటి సంతోష్, రమేష్, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పదవి ఉన్నా లేకున్నా అభివృద్ధి కోసం కలిసికట్టుగా పాటుపడదాం

-ఎంపీపీ తోట నారాయణ

**సూర్య కోరుట్ల**

పదవి ఉన్నా లేకున్నా మనమంతా కలిసికట్టుగా మండల అభివృద్ధి కోసం పాటుపడుదామని కోరుట్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోట నారాయణ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం లో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలలో మండల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు ఎంతో కృషి చేశారని అన్నారు .అలాగే ఎంపీటీసీల పదవీకాలం మరో నెలలో ముగుస్తుందని ఇది తమ పాలకవర్గంలో చివరి సమావేశం అన్నారు. అన్ని రంగాలలో కోరుట్ల మండలాన్ని ముందుంచినందుకు గాను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు దక్కిందని దాంతోపాటు 25 లక్షల నగదు ప్రోత్సాహకం ప్రభుత్వం అందించిందని అన్నారు. ప్రోత్సాహం నగదుతో అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ప్రస్తుత ప్రజాప్రతినిధుల అనుమతితో సమావేశం మందిరాన్ని నిర్మించామన్నారు. పదవి ఉన్నా లేకున్నా పాలకవర్గంతో పాటు ప్రజాప్రతినిధు లు కలిసికట్టుగా ఉండి కోరుట్ల మండల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు .అనంతరం ఎంపీటీసీ లను ఘనంగా అధికారులు సన్మానించారు. అలాగే సమావేశంలో ఏ కిన్ పూర్ సింగిల్ విండో అధ్యక్షుడు సింగిరెడ్డి నర్సిరెడ్డి మాట్లాడుతూ సంఘము నుండి నాగులపేట



వరకు వెళ్లే రోడ్డు మరమ్మతులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని ఈ రోడ్డు పనులను వేగవంతం చేయాలని సభలో కోరగా సంబంధిత ఏ ఈ జ్ఞానేశ్వర్ కాంట్రాక్ట్ తో మాట్లాడి వెంటనే పనులను వేగవంతం చేపిస్తానని హామీ ఇచ్చారు. పైడిమడుగు గ్రామంలో మత్తడి వద్ద సంవత్సరం క్రితం పెద్దబొంగు ఏర్పడడంతో నీరు వృధాగా పోతుందని ఎన్నిసార్లు చెప్పినా ఏ ఈ పట్టించుకోవడంలేదని సింగిల్ విండో అధ్యక్షుడు జగన్మోహన్రావు తెలపడంతో ఏసి సిరాజ్ త్వరలోనే పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. మాదాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో ని సరుకులు పక్కదారికి మల్లుతున్నాయని అసలైన లబ్ధిదారులకు సరుకులు అందడం లేదని ఎంపీటీసీ కృష్ణారెడ్డి సభ దృష్టికి తీసుకురాగా షైనీ మత్తు అంగన్వాడి సూపర్వైజర్ జోక్యం చేసుకొని సరుకులు పక్కదారి పట్టినట్లయితే విలేకరుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పడంతో సభలో ఒక్కసారిగా ప్రజా ప్రతినిధులు ఆమెపై సరియైన సమాధానం చెప్పాలని విరుచుకుపడ్డారు . తమకు వచ్చిన సరుకులను దారి మళ్ళిస్తున్నారని ఎంపీటీసీ వాగ్ వివాదానికి దిగారు. గ్రామంలో పశువైద్యాధికారి ఓ రైతు వద్ద పశువులకు వైద్యం చేయడానికి వారి వద్ద నుండి డబ్బులు తీసుకుని మందులు ఇచ్చాడని సింగిల్ విండో అధ్యక్షుడు జగన్మోహన్రావు సభ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అధికారులు గ్రామాలలో ఉపాధి హామీ లో నాటిన చెట్లను వేపుగా పెరిగాయని వాటిని తొలగించడం పట్ల ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ విద్యుత్ అధికారులు చెట్లు తొలగించే ముందు గ్రామపంచాయతీ కార్య దర్శులకు ముందస్తు సమాచారం అందించాలని కోరారు. ఎవరైనా చెట్లను తొలగించినట్లయితే వారిపై చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు. మండలంలో ఉపాధి హామీ కూలీలకు నాలుగువేల జాబ్ కార్డులు ఉన్నాయని ఇంకా ఎవరైనా పని కావాలని వచ్చినట్లయితే వారికి జాబ్ కార్డులు ఇస్తామన్నారు. ఉపాధి కూలీలు మాత్రం తప్పకుండా ప్రతిరోజు పనికి రావాలని వారికి వందరోజుల పని కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్ పి టి సి దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటీ స్వరూపారాణి ,ఎంపీ ఓ నీరజ, ఎంపీటీసీలు, సింగిల్ విండో అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గోవిందరాజుల స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

**సూర్య చందుర్తి**


చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజుల స్వామి వారిని,రామరావు పల్లెలోని బీరప్ప స్వామి వారిని శుక్రవారం ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు.. ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ కు ఘనస్వాగతం పలికారు.. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..అనంతరం ఆలయ కమిటీ సభ్యు లు ఘనంగా సన్మానించారు...గోవింద రాజుల స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు.జడ్పీటీసీ నాగం కుమార్ కాంగ్రెస్ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# బావిలో దూకి మహిళ ఆత్మహత్యాయత్న

- కాపాడిన బ్లూ కోల్డ్ సిబ్బంది

**సూర్య మల్యాల**



మల్యాల మండలం నూకపల్లి గ్రామ శివారు జగిత్యాల కరీంన గర్ ప్రధాన రహదారి గల ఉన్న వ్యవసాయ బావిలోలో జగిత్యాల కు చెందిన రజిత 35 మహిళఆ త్మహత్యయత్నం కు పాల్పడ్డాది గమనించిన స్థానికులు మల్యాల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటనస్థలానికి చేరుకొని బూల్ కోల్డ్ సిబ్బంది సంపత్ స్థానికుల సహాయంతో బావిలో దిగి రజితను కాపాడారు అనంతరం చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు రజిత ఆశ వర్కర్ గా విధులు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సమస్యల ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు

# మృతుని కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేసిన గాయత్రి బ్యాంక్

**సూర్య, ఇల్లందకుంట**



ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన గన్ను శ్యామ్ సుందర్ ప్రమాదవశాస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించగా జమ్మికుంట లోని ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లో గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాద బీమా 1లక్ష రూపాయల చెక్కుని మృతుని భార్య గన్ను అరుణ కి ఇల్లందకుంట మండల వ్యవసాయ అధికారి రజిత సమక్షంలో జమ్మికుంట బ్రాంచ్ మేనేజర్ ఒద్దుల మహేందర్ అందజేశారు. అనంతరం వ్యవసాయ అధికారి రజిత మాట్లాడుతూ గాయత్రి బ్యాంక్ ఖాతాదారులకు బ్యాంకు సేవలతోపాటు కనీస డిపాజిట్ తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్య తరగతి వినియోగదారులకు ప్రమాద బీమా కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది పట్ల హర్షం వ్యక్తం చేశారు. గాయత్రి బ్యాంకు వినియోగదారుల ఆర్థిక ప్రగతికి సహకారం అందిస్తుందని, 24 గంటల ఏటీఎంలో నగదు అందుబాటులో ఉంచడం ద్వారా ప్రజల అవసరాలు తక్షణమే తీరుస్తుందని అభినందించారు.అనంతరం బ్రాంచ్ మేనేజర్ ఒద్దుల మహేందర్ మాట్లాడుతూ వినియోగదారులకు తక్కువ వడ్డీకే బంగార ఆభరణాలపై గ్రాము కు అత్యధికంగా 5వేల రూపాయలతో రుణాలు అందిస్తున్నామని, రైతులకు వ్యవసాయ రుణాలు కూడా తక్కువ వడ్డీ రేటుకే అందిస్తున్నామని, జమ్మికుంట పరిసర ప్రాంతాలలో 16 సెంటర్లలో వినియోగదారుల సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి పెన్షనర్లకు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు,విని యోగదారుల సేవ కేంద్రం వద్ద తమ లావాదేవీలు నిర్వహించుకోవచ్చు అని, గాయత్రి బ్యాంకులో సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కేవలం ఆధార్ కార్డు, పాన్ కార్డ్ తో వచ్చినట్లయితే పాస్ ఫోటోలు జిరాక్స్ లు బ్యాంకు లోనే తీసి సేవింగ్ ఖాతాలు ఓపెన్ చేయబడతాయని, వ్యాపారస్తులకు వ్యాపార అభివృద్ధి కోరకు రుణాలు కూడా అందిస్తున్నామని ఈ సదవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

# ఈనెల 10 నుండి ఈసెట్ ధ్రువపత్రాల పరిశీలన

- అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్: డాక్టర్ బి. రాజగోపాల్

**సూర్య, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ మండలంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 10 నుండి టిజి ఈ సెట్ మొదటి విడత ధ్రువ పత్రాల పరిశీలన జరుగుతుందని అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజగోపాల్ వెల్లడించారు.జూన్ 10 నుండి తెలంగాణ రాష్ట్రం లోని ప్రభుత్వ/ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా రెండవ సంవత్సరంలోనికి ప్రవేశాల కొరకు టీజీ ఈసెట్%-%2024 లో ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన జూన్ 10 నుండి శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్,అగ్రహారంలో జరుగుతుందన్నారు. **కాల పట్టిక :**జూన్ 08 నుండి 11 వరకు అభ్యర్థులు ఆన్ లైన్ లో స్లాట్ బుకింగ్,జూన్ 10 నుండి 12 వరకు స్లాట్ బుకింగ్ చేసుకొన్నవారికి ధ్రువ పత్రాల పరిశీలన,జూన్ 10 నుండి 14 వరకు ధ్రువ పత్రాల పరిశీలన తరువాత కళాశాలలు, కోర్సులు ఎంచుకోవడానికి,ఐచ్ఛికాలను ఇచ్చుకోవ డం ( వెబ్ ఆప్షన్స్),జూన్ 14ఐచ్ఛికాలను స్తంబింపజేయడం (ఆప్షన్స్ ఫ్రీజిం గ్), జూన్ 18 ఆప్షన్స్ ఇచ్చుకున్న వారికి సీట్ల కేటాయింపు, జూన్ 18 నుం డి 21 వరకు వెబ్ సైట్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించడం,అన్ లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్,**కావలసిన ధ్రువ పత్రాలు:** (ఒరిజినల్స్, రెండు సెట్ల నకలు కాపీలు),టిజిఈసెట్ -2024 ర్యాంక్ కార్డు,టిజిఈసెట్-2024 హాల్ టికెట్,ఆధార్ కార్డు,ఎస్సెస్సీ మెమో,డిప్లొమా/డిగ్రీ మెమోలు, స్టడీ సర్టిఫికేట్ (%ఎ×% నుండి డిప్లొమా వరకు),ఆదాయ ధృవీకరణ పత్రం (01-01-2024 తర్వాత తీసుకున్నది),ఈ.డబ్ల్యూ.ఎస్. ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం,టీసీ(ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్) లతో అభ్యర్థులు తమ అభిరుచి మేరకు వీలైనన్ని ఎక్కువ ఆప్షన్స్ ఇవ్వాల్సిందిగా, కౌన్సిలింగ్ ముగిసేవరకు ఒకే మొబైల్ నెంబర్ వాడాల్సిందిగా పాలిసెట్-2024 జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ బి.రాజగోపాల్ తెలిపారు.మరిన్ని వివరాలకు అభ్యర్థులు %https://tgecet.nic.in% వెబ్ సైట్ లో దర్శించగలరు.

# యుద్ధ ప్రాతిపదికన మినీ స్టేడియం పనుల పురోగతి

## - క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి దోహదపడుతాయి

## - ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సూర్య, వేములవాడ**



క్రీడాలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఉంటుందని ప్రభుత్వ విప్ ,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో శుక్రవారం టీయుడబ్ల్యూజె హెచ్-143 ప్రెస్ క్లబ్ సౌజన్యంతో సాయి క్రికెట్ టీం వారి అధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా స్థాయి మెగా క్రికెట్ పోటీలను ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు.గ్రామాల్లో గతంలో కబడ్డీ,ఖో-ఖో,వాలీబాల్ వంటి క్రీడలను ఆడే వాళ్ళమని గుర్తు చేశారు. నేడు ఆధునిక ప్రపంచంలో క్రికెట్ విశ్వవ్యాప్తంగా అందరూ ఆదరిస్తున్నారని అన్నారు. క్రీడలు అడటడం వలన సమస్యలను అధిగమించే ఒక శక్తి ఏర్పడుతుందని,క్రీడాకారుల మధ్య ఒక స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు.యువత గ్రామాల్లో క్రికెట్ తో పాటు ఇతర క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. మన ప్రాంతంలోని క్రీడాకారులకు ఉపయోగపడేలా అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియాన్ని యుద్ధ ప్రతిపాదికన త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మినీ స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామాగ్రిని అందుబాటులోకి తెస్తామన్నారు. వేములవాడ పట్టణ యువకులకు క్రికెట్ ఆడటానికి మైదానం కావాలంటే మర్రిపల్లి ప్రాంతంలో మైదానానికి స్థల పరిశీలన జరుగుతుందన్నారు .ప్రభుత్వంఅన్ని గ్రామాల్లో ఓపన్ జిమ్ లను ఏర్పాటు చేస్తుందన్నారు.దేశ భవిష్యత్తు నేటి యువత చేతిలో ఉందని,చెడు వ్యసనాలకు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్,గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తోందన్నారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

## మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

**సూర్య తంగళ్లపల్లి**



తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మండేపల్లి చౌరస్తా వద్ద మెగా జాబ్ మేళా పోస్టర్లను తంగళ్ళపల్లి ఎస్సై డి సుధాకర్, ఏఎస్ఐ చంద్రమౌళి, హెడ్ కానిస్టేబుల్‌లు పరమేష్, మల్లేష్ కానిస్టేబుల్‌లు సంపత్, రామ్మోహన్ మండలంలోని యువకులతో కలిసి ఆవిష్కరించారు. సిరిసిల్ల జిల్లా ఎస్పీ శ్రీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తారీకు రోజు సిరిసిల్ల లోని కళ్యాణ లక్ష్మి గార్డెన్ లో నిరుద్యోగ యువకులను ఉద్యోగ అవకాశాల వైపు మళ్ళించడం కొరకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు, జాబ్ మేళాలో అధిక సంఖ్యలో యువకులు పాల్గొని ఉపాధి అవకాశాలని అంది పుచ్చుకోవాలని తంగల్లపల్లి ఎస్సై డి సుధాకర్ కోరారు

## పాఠశాలల్లో తుది దశ పనులు పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**సూర్య సిరిసిల్ల టౌన్**



అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టే తుది దశలో ఉన్న మరమ్మతు పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై జిల్లాలోని ఎంపీడీఓలు,సంబంధిత అధికారులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి అదనపు కలెక్టర్ పి. గౌతమితో కలిసి కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా మండలాల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్ని పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయో వివరాలు అడిగి తెలుసుకుని, మిగితా పనులు త్వరగా పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మ ఆదర్శ పాఠశాల కింద తరగతి గదులు,మరుగుదొడ్లలో మరమ్మతు పనులు చేయించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగు నీటి వసతి కల్పించాలని, తరగతి గదులలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అవసరం మేరకు ఏర్పాటు చేయాలని వివరించారు.తుది దశకు చేరుకున్న పనులను నాణ్యతా ప్రమాణాల ప్రకారం పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి,డీఆర్డీఓ శేషాద్రి,డీఈఓ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ హాస్పిటల్స్ ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలి

**-కలెక్టర్ అనురాగ్ జయంతి**

**సూర్య సిరిసిల్ల టౌన్**



ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం తప్పనిసరిగా రాష్ట్ర అగ్ని మాపక శాఖ నుంచి ఫైర్ సేఫ్టీ సర్టిఫికె ట్ తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.జిల్లాలో మొత్తం 144 ప్రైవేట్ హాస్పిటల్స్ ఉన్నాయని,ఆయా దవాఖానల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకున్న వారందరూ తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ వెబ్సైట్ https://fire.telangana.gov.in లో తమ హాస్పిటల్ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.ఆన్లైన్ లో వివరాలు నమోదు చేసిన అనంతరం అగ్ని మాపక శాఖ వారితో ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయిం చుకొని ఫైర్‌శాఖ ద్వారా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబానికి చల్మెడ పరామర్శ

**సూర్య, వేములవాడ**



రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్ తండ్రి కందుల శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. వారి వెంట సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, పట్టణ కౌన్సిలర్ జోగిని శంకర్, నరాల శేఖర్, గోలి మహేష్, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ప్యాక్స్ ఛైర్మెన్ రామ్ మోహన్ రావు, నాయకులు వాసాల శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, సుంకపాక రాజు, సందీప్, ఆంజద్ పాషా, ఉమర్, రాము, ప్రమోద్, రాకేష్, పర్వేజ్, సాయి, ఉన్నారు.

## ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

**-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**సూర్య సిరిసిల్ల టౌన్**



డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు విలాసాలకు అలవాటైన యువత దృష్టి మళ్లించేందుకు విన్నూత కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణ లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో సుమారు 60 కి పైగా కంపెనీల సహాయంతో 1000 పైగా ఉద్యోగ అవకాశాలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని,జిల్లాలోని టెన్త్, ఇంటర్,డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతి,యువకులు ఇందులో పాల్గొని ఉద్యోగాలు పొందాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు.

## అర్బన్ బ్యాంకుపై బిఆర్ఎస్ జెండా

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్లలో ప్రతిష్టాత్మకంగా జరిగిన సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తన సత్తాను చాటింది.మొత్తానికి అర్బన్ బ్యాంకు పై గులాబీ జెండా ఎగరవేసి కేటీఆర్ మార్కును ప్రతిబింబించారు.ఉత్కంఠ భరితంగా సాగిన సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తన సత్తాను చాటింది.శుక్రవారం రోజున ఉదయం జరిగిన బ్యాంకు చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థులు రాపేల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.వైస్ చైర్మన్ అడగట్ల మురళి ఎన్నికయ్యారు.12 డైరెక్టర్ స్థానాలకు 8 స్థానాలు బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోగా మరో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపారు.అర్బన్ బ్యాంకు అధ్యక్షులుగా రాపల్లి లక్ష్మీనారాయణ నామినేషన్ వేగా బుర్ర రాజు ప్రతిపాదించారు.గుడ్ల సత్యానంద్ బలపరిచారు.మరోవైపు వైస్ చైర్మన్‌గా అడ్డగట్ల మురళిని సంజీవ్ ప్రతిపాదించగా,ఎలగందుల శంకర్ బలపరిచారు.రెండు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో రెండు స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి టి.రామకృష్ణ ప్రకటించారు.గెలుపొందిన బ్యాంకు చైర్మన్,వైస్ చైర్మన్ లకు పూల మాలలువేసి వారికి బాధ్యతలను అప్పగించారు.ఇదిలా ఉండగా చదువుకున్న యువతకు అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా ఎన్నికల నిర్వహించారని ఇట్టి ఎన్నికలను తాము బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చొప్పదండి ప్రమోద్,బిజెపి అభ్యర్థి పత్తిపాక సురేష్ ప్రకటించారు.

## ప్రధానోపాధ్యారాలు కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

**సూర్య బోయినపల్లి / రామడుగు**



రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన తాళ్ళపల్లి సత్తమ్మ , శాతరాజు పల్లి గ్రామంలో జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యారాలుగా విధులు నిర్వహిస్తున్న ఆమె తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ముగించుకొని ఇంటికి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది ఆమె కుటుంబసభ్యులను కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎంపీపీ జవ్వాజి హరిశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు. బొమ్మరవేణి,తిరుపతి ముదిరాజ్, దేశరాజ్ పల్లి. తాజా మాజీ సర్పంచ్ కోల రమేష్ ,మాజీ ఎంపీపీ నరసింగరావు, మాజీ ఎంపీటీసీ బండపెల్లి యాదగిరి ,మాజీ సర్పంచ్ శంకర్ ,ఎలమల్ల కృష్ణా శ్రీను బాబు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలం నర్మాల ఎంపియుపిఎస్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, ఉచిత పాఠ్యపుస్తకాలు ఉచిత దుస్తులు మధ్యాహ్న భోజనం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం ఉంటుందని తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్, ఉపాధ్యాయులు దేవరాజ్, సువర్ణ, అంగన్వాడి టీచర్లు పద్మ అంజలి తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు పక్కాగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలి

- సజావుగా జరిగేలా చూడాలి - పొరపాట్లు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి..
- టీజీపీఎస్సీ నిబంధనలపై అభ్యర్థులకు అవగాహన ఉండాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గ్రూప్-1 ప్రిలిమ్స్ నోడల్ ఆఫీసర్ ప్రఫుల్ దేశాయ్





**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఈనెల 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు అధికారులంతా పక్కాగా శనివారంలోగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గ్రూప్-1 నోడల్ ఆఫీసర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల రూట్ ఆఫీసర్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షకు సంబంధించి టీజీపీఎస్సీ రూపొందించిన నిబంధనలపై వారికి అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీజీపీఎస్సీ రూపొందించిన నిబంధనలపై అధికారులతో పాటు అభ్యర్థులకు అవగాహన ఉండాలని పేర్కొన్నారు. అధికారులు శనివారం వరకే ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు వాటి పనితీరు.. తాగునీరు.. టాయిలెట్స్ ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీటింగ్ అరేంజ్మెంట్లు పక్కగా చేయాలని, అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని తెలిపారు. ఒక గదిలో 24, 48, 72 మంది ఉండేలా చూసుకోవాలని చెప్పారు కరీంనగర్లో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయన్నారని వివరించారు. అభ్యర్థులు మూడోసారి ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవుతున్నారని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగవద్దని, అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయా సెంటర్ల వద్ద ఒకే గేటును మాత్రమే ప్రవేశానికి ఉంచాలని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సెంటర్ కోడ్, సెంటర్ పేరు పెద్ద అక్షరాలతో ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒకరోజు ముందే పరీక్ష కేంద్రం వద్దకు వెళ్లి పరిశీలించాలని చెప్పారు. ఈ నెల 9న ఆదివారం ఉదయం 9 గంటల వరకే అభ్యర్థులంతా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 9:30 గంటల నుంచి బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు తీసుకుంటారని తెలిపారు. 10 గంటలకు ఆయా పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని, ఆ తర్వాత వచ్చే అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఉదయం 10:30 నుంచి 1:00 వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో అరగంటకు ఒకసారి బెల్ మోగిస్తారని చెప్పారు. అభ్యర్థులందరికీ బెల్ వినిపించేలా ఏర్పాట్లుచేపటాలని సూచించారు. అభ్యర్థులంతా టీజీపీఎస్సీ రూపొందించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆయా పరీక్ష జరిగే సమయంలో కేంద్రాలను తరచూ పర్యవేక్షించాలని సూచించారు. సెల్ ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదని, ఎవరైనా తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులంతా కేటాయించిన పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందే సందర్శించి సౌకర్యాలపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పవన్ కుమార్ ఆర్డిఓ కే మహేశ్వర్, అడిషనల్ డీసీపీ జే కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, కొండగట్టు జెఎన్టియు ప్రొఫెసర్ బీ సతీష్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి లో ఈ సారి 663 హెక్టర్ లలో మొక్కల పెంపకం

### -వర్షాకాలంలో మొక్కల పెంపకానికి శ్రీకారం

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థలో 663 హెక్టార్లలో మొక్కల పెంపకానికి యాజమాన్యం నిర్ణయించింది. 2024- 25 వ ఆర్థిక సంవత్సరానికి సింగరేణి సంస్థలు అన్ని డివిజన్ లలో మొక్కలు నాటనున్నారు. సింగరేణిలో ఓబి డంప్ యార్డ్ ల పై , వృధా స్థలంలోని బ్లాక్ లలో, రోడ్డు ప్రక్కన ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటనున్నారు. కొత్తగూడెం డివిజన్ లో 49.3 హెక్టర్ లో మొక్కలు నాటుతారు. ఇల్లందులో స్థలం కొరత ఉంది. మణుగూరులో 73.54 హెక్టార్లలో, ఆర్జీ -1 లో 119 హెక్టార్లలో, ఆర్జీ -2 లో 43 హెక్టర్ లలో, భూపాలపల్లి లో 110.15 హెక్టార్లలో, శ్రీరాంపూర్ లో 26 .37, బెల్లంపల్లిలో 26 హెక్టార్లలో, మందమర్రి డివిజన్లో 67.96 హెక్టార్లలో మొక్కలు నాటనున్నారు. మొత్తం సింగరేణి వ్యాప్తంగా 304.23 హెక్టార్లలో ఓబి డంప్ యార్డ్ ల పై, 310.54 హెక్టార్లలో బ్లాక్ లపై, 48.15 హెక్టార్లలో రోడ్డు పక్కన ఎవెన్యూ ప్లాంటేషన్ మొత్తం కలుపుకొని 663 హెక్టార్లలో మొక్కలు నాటనున్నారు.

### పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట



ప్రతి ఏటా మాదిరిగానే సింగరేణిలో మొక్కలు నాటుతాం. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం. అన్ని ఏరియాలో వృధా స్థలాలను, ఓబీ డంప్ యార్డ్ లను, రోడ్ల పక్కన ఖాళీ స్థలాలను గుర్తించాము. వర్షాకాలం ప్రారంభం కాగానే మొక్కలు నాటుతాం. అన్ని ఏరియా లలో నర్సరీలు పెంచుతున్నాం.

**- నునవత్ బలరాం నాయక్, ( సీఎం.డీ)**

### 663 హెక్టార్లలో మొక్కలు పెంచుతాం



సింగరేణి సంస్థలో కొత్తగూడెం, రామగుండం, బెల్లంపల్లి రీజియన్ లలో ఖాళీ స్థలాలను గుర్తించాం. 663 హెక్టార్ల ఓబి డంప్ యార్డ్ లు, ఖాళీ స్థలాలలో, రోడ్ల పక్కన మొక్కలు నాటుతాం. వాటి పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడతారు.

**- ఎన్.వి.కే శ్రీనివాస్, డైరెక్టర్ (పా,ఆపరేషన్స్)**

### మొక్కల పెంపకంకు ప్రణాళిక



ఆర్జీ -3, ఆడ్రియాల డివిజన్ లో మొక్కల పెంపకానికి ప్రణాళిక సిద్ధం చేసాం. 2024 -25 వ ఆర్థిక సంవత్సరంలో వర్షాలు పడగానే జూన్ - ఆగస్టు మధ్య వాటిని నాటుతాం . పలు రకాల మొక్కలు నర్సరీలో పెంచుతున్నాం. వీటిని కాలనీ లో, గనుల వద్ద, ఖాళీ స్థలాలలో, రోడ్ల పక్కన మొక్కలు నాటుతాం.

**-బాణోత్ కర్ణ, ఫారెస్ట్ డీజీఎం**

## యదేచ్ఛగా అక్రమ మట్టి దందా

- అనుమతులు లేకుండా రవాణా...
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పెద్దపల్లి జిల్లాలో మట్టి మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోతుంది. అంత మా ఇష్టం అంటూ పెట్రాగిపోతున్నారు. అనుమతులు తీసుకోకుండా మట్టి రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకుండా 'మామూలు'గా తీసుకుంటున్నారు. జిల్లాలోని పలు చెరువుల నుండి నిబంధనల ప్రకారం మట్టిని తీసుకోవడానికి అధికారులు అనుమతులు ఇవ్వగా నిబంధనలు ధిక్కరిస్తూ ఇచ్చిన పరిధి దాటుతూ అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్పల్లి చెరువు నుండి తీసిన మట్టిని రవాణా చేయడానికి ఇచ్చిన పరిధిని దాటి మిగతా ప్రాంతాలకు ఏదేచ్ఛగా తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి అక్రమ మట్టిని తీసుకురాగా గ్రామస్తులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న అధికారులు అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న లారీలను సీజ్ చేయాల్సింది పోయి వదిలి వేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి మాఫియా దారులతో అధికారులు సైతం చేతులు కలిపారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా పట్టుబడిన లారీలకు అనుమతి ఉన్నట్లు తెలిపారు అయితే డ్రైవర్లు రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలను వెంట తీసుకురావకపోవడంతో గ్రామస్తులు అడ్డుకున్నారని అన్నారు. అనుమతి పత్రాలను పరిశీలించాకే లారీలను వదిలేసినట్లు తెలిపారు.

## అలంకారప్రాయంగా "పల్లె దవాఖానాలు"

- గంభీరావుపేటలో తెరుచుకొని పల్లె దవాఖాన..
- భవనం పూర్తయిన అందని వైద్య సేవలు

**సూర్య గంభీరావుపేట**



గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సర్కారు వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం ఎఫ్ పథకం కింద మండల కేంద్రంతో పాటు జగదాంబ తండాలో రెండుచోట్ల పల్లె దవాఖానాలను నిర్మించారు.కానీ పల్లెల్లో పని చేయడానికి డాక్టర్ల నుంచి స్పందన కరువైంది. గ్రామీణ ప్రాంతాల్లోని హెల్త్ సబ్ సెంటర్ లను ప్రభుత్వం పల్లె దవాఖానాలుగా మార్చి ప్రతి దవాఖానాలో ఎంబిబిఎస్ డాక్టర్, ఏఎన్ఎం లేదా ఆరోగ్య కార్యకర్తను, నియమించాలని నిర్ణయించింది. గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు జగదాంబ తండాలో నిర్మించిన పల్లె దవాఖానాలు మాత్రం నేటికీ తెరుచుకోవడం లేదు. మండల కేంద్రంలో పల్లె దవాఖాన10 నెలల క్రితం ప్రారంభించి వదిలేశారు.జగదాంబ తండాలో పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఉన్నతాధికారులు చొరవ చూపించిపల్లె దవాఖానాలను అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# గ్రూప్ -1 పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలి

## - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

ఆదివారం ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 1-00 గంట వరకు నిర్వహించు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ - 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో, ముందస్తుగా పరీక్ష సెంటర్లకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9-00 గంటల నుండి 10-00 వరకు పరీక్షా సెంటర్ లోనికి అనుమతి ఉంటుందని, 10 గంటల సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితిలో అనుమతి ఉండదని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి పరీక్షా సమయానికి ముందస్తుగా వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాయాలని, అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ హాల్ టికెట్ తో పాటు ఒరిజినల్ వ్యాలిడిటి ఫోటో ఐ.డి. గుర్తింపు కార్డ్ తీసుకొని రావాలని సూచించారు. బయోమెట్రిక్ 9-30 గంటల నుండి ప్రారంభించబడునని, అభ్యర్థులు బయోమెట్రిక్ వేయకుండా పరీక్షా కేంద్రం వదిలి వెళ్లరాదని, అభ్యర్థులు చేతి వేళ్ళపై ఎలాంటి మెహంది, టాటూలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరిక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లే ముందు తమ హాల్ టికెట్ పై పాస్పోర్ట్ సైజ్ ఫోటోను తప్పనిసరిగా అతికించాలని, ఈ ఫోటో 3 నెలల లోపు దిగినదే అయి ఉండాలన్నారు. హాల్ టికెట్ పై ఫోటో అతికించకపోతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడరని, ఈ నిబంధనను హాల్ టికెట్ లో పొందు పరిచినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలలో 6098 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్షా కేంద్రాల్లోకి వెళ్ళే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపనున్నందున అభ్యర్థులు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్ లు, చేతి గడియారాలు వెంట తీసుకొని రావద్దని, పరీక్షా కేంద్రములోకి వెళ్ళిన అభ్యర్థి పరిక్షా సమయం ముగిసేంతవరకు పరీక్షా కేంద్రం వదిలి వెళ్ళుటకు అనుమతించబడరని కలెక్టర్ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలలోనే నాణ్యమైన విద్య

## - డీఈవో రమేష్ కుమార్

**సూర్య సిరిసిల్ల టౌన్**



ప్రభుత్వ పాఠశాలలలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని,విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలలోనే పిల్లలను చేర్పించాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ కోరారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకంపేట ఆధ్వర్యంలో చేపట్టిన బడి బాటలో భాగంగా తారక రామా నగర్,గణేష్ నగర్,సుందరయ్య నగర్, వెంకంపేట, పద్మనగర్,బి.వై.నగర్ ప్రాంతాల్లో చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమం లోవారు పాల్గొని మాట్లాడారు.సకల సౌకర్యాలతో,సరికొత్త హంగులతో, అటల్ టింకరింగ్ ల్యాబ్,కంప్యూటర్ విద్య,ఉచిత పాఠ్య పుస్తకాలు,రెండు జతల డ్రెస్లు, మధ్యాహ్న భోజనం,నాణ్యమైన విద్యతో పాటు అనుభవం అర్హతగల ఉపాధ్యాయులతో,ఆధునిక పరిజ్ఞానంతో,అమ్మ ఆదర్శ కమిటీలు,డిజిటల్ తరగతులు, విశాలమైన భవనాలు,చక్కని క్రీడా ప్రాంగణంలతో ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని పిలుపునిచ్చారు.ఎంఈఓ దుస రఘుపతి మాట్లాడుతూ ట్రిబుల్ ఐటీ సీట్లు సాదించాలన్న, ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ రావాలన్న 10 జిపిఏ సాదించాలన్న అది వెంకంపేట ఉన్నత పాఠశాలలోనే సాధ్యమౌతుందని వెంటనే మీ పిల్లలను మా పాఠశాలలోనే చేర్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దూస రఘుపతి,సెక్టోరియాల్ అధికారి సతీష్, స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు,కమలాకర్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్,పద్మ, భారతి,వెంకంపేట పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి - జూలపల్లి డబుల్ రోడ్డును, కాళేశ్వరం - కామారెడ్డి రోడ్లకు అనుసంధానిస్తూ"రాష్ట్ర రహదారి"గుర్తించాలి

**సూర్య జూలపల్లి**



పెద్దపల్లి - జూలపల్లి డబుల్ రోడ్డును,కాళేశ్వరం - కామారెడ్డి రోడ్లకు అనుసంధానిస్తూ "రాష్ట్ర రహదారి" గుర్తించాలని ముఖ్యమంత్రిని కోరుతూ ప్రజా భవన్ లో మండల కేంద్రానికి చెందిన మారం తిరుపతి యాదవ్ శుక్రవారం వినతి పత్రం అందించారు.గత 30 సంవత్సరాల నుండి ఎలాంటి అభివృద్ధికి నోచుకోక పెద్దపల్లి జిల్లాలో జూలపల్లి అతి వెనుకబడ్డ ప్రాంతంగా మిగిలిపోయిందని,మండల కేంద్రం నుండి పెద్దపల్లి జిల్లా కేంద్రం వరకు గల రహదారి చాలా దయనీయమైన పరిస్థితిలో ఉన్నదని ఎన్నో సంవత్సరాల నుండి మరమ్మతులు లేక,విస్తరణ లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని, ముఖ్యంగా వైద్యం,ఇతర ఏ పనులకైన జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మండల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాళేశ్వరం నుండి పెద్దపల్లి వరకు ఉన్న రోడ్డును జూలపల్లి,వేములవాడ, కొండగట్టు,కామారెడ్డి రోడ్డుకు అనుసంధానిస్తే రాష్ట్ర రహదారి"గా గుర్తింపు వస్తే ఎంతో అభివృద్ధి చెందుతుందని వినతి పత్రంలో పేర్కొన్నట్టు తెలిపారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోండి

## -బీజేపీ డిమాండ్

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి యాజమాన్యాన్ని దోచుకుంటున్న ప్రైవేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని రామగిరి మండలం బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్జీ-3 పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి కి వినతిపత్రం అందజేయడం జరిగింది. సెంటనరి కాలనీలో సింగరేణి యాజమాన్యం సహకారంతో కార్మికుల పిల్లలకు ప్రభావిత గ్రామ పిల్లలకు నాణ్యమైన విద్యను అతి తక్కువ ఖర్చుతో ఇవ్వాలని సింగరేణి స్కూల్ ను వాణి స్కూల్ విద్యా సంస్థకు లీజుకు ఇవ్వడం జరిగిందని, కానీ ఈ ప్రైవేటు విద్యా సంస్థ కార్మికుల పిల్లలను ప్రభావిత గ్రామ పిల్లలను దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తుందని, 25 సంవత్సరాలుగా లక్షల రూపాయలు దోచుకుంటున్న కూడా సింగరేణి అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమమే... మా ధ్యేయమని చెప్తున్నా, అది కేవలం మాటలకే పరిమితం అవుతుందని, ఇప్పటివరకు ఈ యొక్క విద్యాసంస్థ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఎస్సీ, ఎస్టీలకు విద్యాహక్కు చట్ట ప్రకారం ఫీజు రాయితీ ఉండగా దానిని కూడా ఖాతరు చేయడం లేదని అన్నారు. కార్మికులు కష్టపడి ప్రతి సంవత్సరం లాభాల బాటలో కంపెనీ తీసుకువస్తుంటే కనీసం మా పిల్లలకు నాణ్యమైన విద్య కూడా అందించడం లేదని బాధపడుతున్నారని, కార్మిక సంఘాలు కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదని, సింగరేణి అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి పిల్లల బంగారు భవిష్యత్తు కొరకై ఈ యొక్క విద్యాసంస్థతో అగ్రిమెంట్ ను రద్దు చేసి సింగరేణి యాజమాన్యమే నడపాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున బీజేపీ పార్టీ తరఫున కార్మికులు కార్మికుల పిల్లలతో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్,సెంటనరీ కాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్, దొంతుల సురేష్, తొట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 10న సదరం స్లాట్ బుకింగ్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం జూన్ 10న సోమవారం ఉదయం 11-35 గంటల నుండి మీ- సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.రవీందర్ శుక్రవారం తెలిపారు.క్రొత్తగా సదరం సర్టిఫికేట్ కావాల్సిన వారు, తాత్కాలిక సదరం సర్టిఫికేట్ ఉన్నవారు రెన్యువల్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని, మానసిక అంగ వైకల్యం, బుద్ధి మాన్యం ఉన్న వారు జూన్ 13న నిర్వహించు క్యాంప్ స్లాట్ కొరకు, దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్నవారు జూన్ 20న నిర్వహించు క్యాంప్ స్లాట్ కొరకు, శారీరక అంగ వైకల్యం గలవారు జూన్ 27నాటి క్యాంప్ స్లాట్ కొరకు జూన్ 10న ఉదయం 11-35 గంటల నుండి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ నమోదు చేసుకోవాలని, స్లాట్ బుకింగ్ అనంతరం మెడికల్ క్యాంపులకు వచ్చే సందర్భంలో దరఖాస్తుదారులు మీసేవ సదరం స్లాట్ బుకింగ్ రసీదుతో పాటు వికలాంగత్వ పరీక్షా కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్ట్ లను తీసుకొని రావాలని డి.ఆర్.డి.ఓ. ఆర్.రవీందర్ తెలిపారు.

# రక్షణ చర్యలపై అధికారులకు అవగాహన

## -రామగుండం ఏరియా-1 జీఎం చింతల శ్రీనివాస్

**సూర్య-గోదావరిఖని**



ఇక్కడి సింగరేణి సంస్థకు చెందిన జిడికె-11వ బొగ్గు గనికి సంబంధించిన అధికారులకు కార్మికులు పనిచేసే స్థలాల్లో తీసుకోవలసిన రక్షణ చర్యలపై ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి పైనే దృష్టి సారించకుండా భద్రత, బాధ్యత, కుటుంబ భద్రత, వైఖరి, ప్రవర్తన, సంస్కృతి, క్రమశిక్షణ, సాధారణ ఆరోగ్య సాధన, క్రమశిక్షణ పై కూడా అధికారులు కచ్చితంగా దృష్టి సారించాలని సూచించారు. భద్రతా అంశాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఇప్పటివరకు 11 వ బొగ్గు గనిలో జరిగిన ప్రమాదాల వివరాలు, ప్రాణాంతక ప్రమాదాలు, రోడ్ ఆక్సిడెంట్ మరణాలు, సాధారణ మరణాలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను జిఎం అడిగి తెలుసుకున్నారు. ఆలాగే కాంట్రాక్ట్ కార్మికుల రక్షణ విషయంలో కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఎస్ఎంపి, ఎస్ఓపి కి సంబంధించిన అన్ని నియమాలు పాటించి వాటిని అనుసరించాలని ఆదేశించారు. బొగ్గు గనులలో పనిచేసే వారికి చిన్న ప్రమాదం కూడా జరగకూడదని, శూన్య హాని, ఆరోగ్యకరమైన ఉద్యోగులే సంస్థ లక్ష్యమని చెప్పారు. ఈ సమావేశంలో రామగుండం ఏరియా-1 ఇంజనీర్ రామ్మూర్తి, ఏజంట్ చిలుక శ్రీనివాస్, డిజియం ఫైనాన్స్ ధనలక్ష్మిభాయి, గని మేనేజర్ ఏ.నెహ్రు, గ్రూఫ్ ఇంజనీర్ రాందాస్, ప్రాజెక్ట్ మేనేజర్ శుక్ల తదితరులతో పాటు సెక్షన్ ఇంచార్జ్ లు పాల్గొన్నారు.

# బేటి బచావో బేటి పడావో పై ప్రజలకు అవగాహన

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్పూర్ మండలం లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సభ్యులచె పరిసరాల పరిశుభ్రత డ్రగ్స్ గంజాయి మాదకద్రవ్యాలు , ఆడపిల్లలని పుట్టనిద్దాం... ఎదగనిద్దాం, చదవనిద్దాం, బేటి బచావో బేటి పడావో అని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. యువత పెడుతూవ పట్టకుండా మంచి మార్గంలో నడవాలని నేటి యువత 30 సంవత్సరాలు నిండకుండానే యాక్సిడెంట్లలో అనారోగ్యాలతో చాలా మంది యువత మరణాలపాలవుతున్నారని, తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారని, నేటి యువత రేపటి దేశ భవిత అని యువతరం గ్రహించాలని, తల్లిదండ్రులు కన్న కలలు నిజం చేయాలని పాటల రూపంలో అవగాహన కల్పించడం జరిగింది. అలాగే వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఆర్ఓ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు కోండ్ర వెంకన్న గౌడ్, జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, ఇల్లందుల మల్లేష్ గౌడ్, బుర్ర శంకర్ గౌడ్, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, జిన్న, రమా, కన్నూరి రేణుక, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# బాధిత కుటుంబానికి చల్మెడ పరామర్శ

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం మర్తన పేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ముంద్రాయి సందీప్ కుమార్ గురువారం కరెంటు షాక్ గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం సందీప్ కుమార్ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పుట్టెడు దుఃఖంతో ఉన్న వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాఘవరెడ్డి,కొలనూర్ ప్యాక్స్ ఛైర్మెన్ రాంమోహన్ రావు,మాజీ సర్పంచ్ వంశీకృష్ణ రావు తదితరులు ఉన్నారు.

# పకడ్బందీగా గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ

**– స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా నోడల్ అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా పోలీస్ నోడల్ అధికారి, రీజనల్ కో–ఆర్డినేటర్ తో కలిసి జూన్ 9న నిర్వహించు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకై నియమించబడిన రూట్ ఆఫీసర్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్ కి వివిధ స్థాయిలలో ఎవరెవరు ఏమేమి చేయాలి అనే అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పరీక్ష నిర్వహణ సమయం లో ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే అంచనా వేసి వాటిని పరిష్కరించాలని, జిల్లాలో జూన్ 9న జరుగనున్న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష పకడ్బందీ నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని అన్నారు. పరీక్ష కంటే ఒకరోజు ముందు రూట్ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు, పోలీస్ అధికారులు సంయుక్తంగా ప్రశ్నాపత్రాల తరలింపు రూట్ లను తనిఖీ చేయాలని సూచించారు. ఓఎంఆర్ షీట్ పై ముందుగానే అభ్యర్థి వివరాలు ప్రింట్ అయి వస్తాయని, వాటిని సంబంధిత అభ్యర్థులకే అందించేలా చూడాలని అన్నారు. పరీక్షా కేంద్రం ప్రాంగణంలో, అదే విధంగా భవనం వద్ద ప్రతి 100 మంది అభ్యర్థులకు ఒక్కరు చొప్పున నియమించబడిన ఐడెంటిటీ అధికారులు, ప్రతి అభ్యర్థిని పూర్తి స్థాయిలో చెక్ చేయాలని, మహిళలను పరిశీలించేందుకు మహిళా సిబ్బంది, ప్రత్యేక కంపార్ట్మెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రం ప్రాంగణంలోకి సెల్ ఫోన్ అనుమతి ఉండదని, అభ్యర్థులు ఎవరు సెల్ ఫోన్ తీసుకుని రావడానికి వీలులేదని , ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి సైతం సెల్ ఫోన్ అనుమతి ఉండదని సూచించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకునేందుకు వీలుగా బయో మెట్రిక్ అటెండెన్స్ కోసం ప్రత్యేక ఇన్విజిలేటర్ లను నియమించామని, ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒక రోజు ముందుగా వెళ్లి పరీక్షా కేంద్రాన్ని ధృవీకరించుకోవాలని, బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 9 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, ఎట్టి పరిస్థతుల్లో 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు తో పాటు గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలని సూచించారు.పరీక్ష ప్రారంభ సమయంలో లాంగ్ బెల్, ప్రతి అరగంట సమయానికి బెల్, చివరి 30 నిమిషాలు ఉన్నప్పుడు అలారం బెల్ మోగే విధంగా ఏర్పాట్లు చేయబడినవని, ఒంటి గంట కు పరీక్ష ముగుస్తుందని, పరీక్ష ముగిసిన తర్వాత అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు తప్పని సరిగా వెనక్కి తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పరీక్ష కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ అధికారి పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలని, ప్రతి హాల్, ప్రాంగణం పూర్తిగా తనిఖీ చేయాలని తెలిపారు.

జూన్ 8న ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్, ఇన్విజిలేటర్ లు, సెక్యూరిటి సిబ్బంది, ఐడెంటిటీ అధికారులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించాలని అన్నారు. ప్రతి పరీక్షా హాల్లో సీటింగ్ అరేంజ్మెంట్ కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్నపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో జరుగుతుందని, ప్రతి అంశం సీసీ కెమెరాలో రికార్డు అయ్యే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డి.సి.పి.(అడ్మిన్) రాజు, రీజనల్ కో–ఆర్డినేటర్ డాక్టర్. కె. లక్ష్మీ నర్సయ్య , సి సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అనుమతి లేని జూనియర్ కళాశాలలను మూసివేయాలి






**సూర్య కరీంనగర్ టౌన్**

అనుమతి లేని జూనియర్ కళాశాలలను మూసివేయాలినీ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ ఆఫీసర్ వెంకటేష్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఆసంపెల్లి వినయ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ కళాశాల సమస్యల పరిష్కరించాలి, అదేవిధంగా ఇంటర్మీడియట్ కళాశాలలో ఫీజులు నియంత్ర చట్టం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కరీంనగర్లో నారాయణ లాంటి కార్పొరేటర్ కళాశాలలో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ సమ్మర్ హాలిడేస్ లో కూడా క్లాస్ లు నడిపిస్తున్న కానీ జిల్లా అధికారులు ఎందుకు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కనీసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా అధ్యాపకులు లేక మరొకరు అధ్యాపకులతో విద్యార్థులు చదువుతున్న పరిస్థితి కనిపిస్తుంది కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు గుర్తు చేశారు. విద్యార్థులకు కనీసం మరుగుదొడ్లు మూత్రశాలలు త్రాగునీరు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న కానీ డి ఐ ఓ గారు కనీసం ఇంటర్మీడియట్ కళాశాలలో పర్యవేక్షణ చేయడం లేదని తెలిపారు కావున ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ కళాశాలను పర్యవేక్షణ చేసి విద్యార్థుల సమస్యలు పట్టించుకోవాలని వారు కోరారు. అదేవిధంగా మండల హెడ్ కోటర్ లో ఉన్న జూనియర్ కళాశాలలో నూతన వృత్తివిద్య కోర్సులను తీసుకువచ్చి విద్యార్థలకు అందుబాటులో ఉంచే విధంగా ఇంటర్మీడియట్ అధికారి చర్యలు తీసుకోవాలని ఈ సరర్భంగా వారు తెలియజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు తిప్పారావ్ రోహిత్ జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, సద్విత్ కుమార్, మనోజ్ పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య కళాశాలలో జరిగిన ఉచిత మెడికల్ క్యాంప్ కు విశేష స్పందన

**సూర్య తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని స్థానిక శ్రీ చైతన్య డిఫెన్స్ ,స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం ఇండియన్ ఆర్మీ,అగ్నిపథ్, పారా మిలటరీ దళాలకు సంబందించినసుమారు 298 మంది ఉద్యగ నియామకాల్లో భాగంగా అభ్యర్థుల కు మెడికల్ఫిట్ నెస్ సంబంధించిన 18 రకాల మెడికల్ టెస్టను శ్రీ చైతన్య డిఫెన్స్ , స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించారు.ఈ ఫిట్నెస్ పరీక్షల్లో అభ్యర్థులు హాజరై వారి ఫిజికల్, దేహ దారుఢ్యపరీక్షలు చేసుకొన్నారు. ఈ ఫిట్నెస్ పరీకలనుశరత్ మాక్స్ వర్షన్ విజన్, కేశవ E.N.T ఆస్పత్రుల డాక్టర్లు సమక్షంలో కళాశాలలో క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్న డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రిన్సిపాల్



పల్లె శ్యాం సుందర్ రెడ్డి ,P.D మహిపాల్ రెడ్డితో పాటు సిబ్బంది, అధ్యార్థులు పాల్గోన్నారు.

# బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

**– ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం మర్తనపేటలో గురువారం విద్యుత్ షాక్ తో మృతి చెందిన రైతు ముంద్రాయి సందీప్ కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మర్తనపేటలోని సందీప్ మృతదేహానికి పూలమాల వేసి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యువరైతు ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురై మృతి చెందడం బాధాకరమని, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుని సోదరుడు న్యూజీలాండ్ నుండి శుక్రవారం రాత్రి రానున్నాడని శనివారం అంత్యక్రియలు చేయనున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.అలాగే బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫిరోజ్ పాషా,మాజీ సర్పంచ్ వంశీ,జిల్లా కార్యదర్శి తాళ్ళపల్లి ప్రభాకర్ కచ్చకాయల ఎల్లయ్య,నాయకులు నిరంజన్ రావు,ఐదరి శ్రీనివాస్,గొట్టిపర్తి రామచంద్రం, వెంగలి వెంకన్న,గంగుల ఎల్లయ్య,అతికం శ్రీనివాస్,ముత్త య్య గౌడ్ పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రత

**– స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



గ్రూప్ –1 ప్రిలిమ్స్ పరీక్ష సామగ్రిని పటిష్టమైన భద్రత మధ్య భద్రపరచామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గ్రూప్–1 పరీక్షల నోడల్ ఆఫీసర్ ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కరీంనగర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని స్ట్రాంగ్ రూమ్ కు గ్రూప్–1 పరీక్షకు సంబంధించిన సామగ్రిని తరలించారు. సామగ్రి భద్రపరచే ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్, ఆర్డీఓ కే మహేశ్వర్, అడిషనల్ డీసీపీ జే కుమార్ పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పరీక్షకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలు, ఇతర మెటీరియల్ అన్నింటిని సరి చూసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గ్రూప్–1 పరీక్ష ప్రశాంతంగా, సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుం టున్నామని వివరించారు. సామగ్రిని ఆదివారం ఉదయం ఆయా పరీక్ష కేంద్రాలకు పోలీస్ ఎస్కార్ట్ మధ్య తరలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, కొండగట్టు జెఎన్టియూ ప్రొఫెసర్ బీ సతీష్ కుమార్, కలెక్టరేట్ సూపరిండెంట్ కాళీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరా అంతరయం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

మిషన్ భగీరథ ప్రధాన పంప్ హౌస్ మహ్మదాపూర్ సబ్ స్టేషన్ మరమ్మత్తులు పనులు కరణంగా తేదీ 08.06 2024 ఉదయం 08:00 గంటల నుండి సాయంత్రం 08:00 మరియు తేదీ 09.06.2024 ఉదయం 08:00 గంటల నుండి సాయంత్రం 04:00 రెండు రోజులు నీటి సరఫరా అంతరయం కలుగున్న, హుజురాబాద్ మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.రామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.మిషన్ భగీరథ ప్రధాన పంప్ హౌస్ మహ్మదాపూర్ సబ్ స్టేషన్ మరమ్మత్తులు పనులు కరణంగా తేదీ 08.06 2024 ఉదయం 08:00 గంటల నుండి సాయంత్రం 08:00 మరియు తేదీ 09.06.2024 ఉదయం 08:00 గంటల నుండి సాయంత్రం 04:00 రెండు రోజులు నీటి సరఫరా అంతరయం కలుగును. మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గంలోని మండలాలలో నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారుగన్నేరు వరం మండలం.బెజ్జంకి మండలం.ఎల్లంతకుంట మండలం.కోహెడ మండలం.హుస్నాబాద్ మండలం. అక్కన్నపేట మండలం.భీమదేవరపల్లి మండలలలో నీటి సరఫరా నిలిపివేయబడును కావున ఆయా మండలాల ప్రజలు సహకరించాలాని ఆయన కోరారు.

# తెలంగాణలో రాబోయే ప్రభుత్వం బిజెపిదే...

**-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యల ప్రదీప్ కుమార్**

**సూర్య-పెద్దపల్లి టౌన్**

పెద్దపల్లి బిజెపి పార్లమెంట్ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ముందుగా పెద్దపల్లి పార్లమెంట్లో , పెద్దపెల్లి అసెంబ్లీలో మోడీ పటిష్ఠమైన నాయకత్వాన్ని వారి సమర్థ పాలను అలాగే సుపరిపాలన చూసి ఓట్లు వేసిన పెద్దపల్లి ప్రజానీకానికి, రైతులకు, మహిళలకు ,యువకులకు, ఉద్యోగస్తులకు, ఇతర అన్ని రకాల ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాబోయే కాలంలో కూడా ఇదే విధంగా బిజెపి పార్టీకి ఓట్లు వేసి పెద్దపల్లి అసెంబ్లీలో సుపరిపాలనకు బాట వేయాలని కోరారు. ప్రపంచ స్థాయిలో ప్రపంచ దేశాలు మెచ్చుకునే విధంగా మోడీ పాలన అందించడం చూసిన ప్రజలు బిజెపి పార్టీకి ఓట్లు వేశారు. ఈ పది సంవత్సరాల పాలనలో ఏలాంటి అవినీతి కుంభకోణాలు లేకుండా పాలన అందించిన ఘనత కూడా బిజెపి ది . కాంగ్రెస్ ప్రభుత్వాల హాయంలో అవినీతి ,కుంభకోణాలు, బాంబు బ్లాస్టులు, ఏలాంటి డెవలప్మెంట్ లేకుండా ఉండేది, కానీ మోడీ గారి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఎలాంటి అవినీతి, కుంభకోణాలు లేకుండా ప్రపంచ స్థాయిలో డెవలప్మెంట్ చేసిన ఘనత మోడీ గారిది. దేశంలో, ప్రపంచ స్థాయిలో మోడీ గారికి ప్రజలలో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక ఏర్పాటువాద పార్టీలు, కుటుంబ పార్టీలు అన్నీ కలిసి,అబద్ధపు ప్రచారాలు చేస్తూ మళ్లీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని



మారుస్తారని ,కుల రిజర్వేషన్లు రద్దు చేస్తారని అబద్ధపు ప్రచారాలు చేసి మోడీ గారికి వ్యతిరేకంగా పోటీ చేశాయి. అలా చేస్తే 30 పైగా పార్టీలకు 230 ఒక సీట్లు రాగా బిజెపి పార్టీకి స్వతగా 240 సీట్లు రావడం జరిగింది . మోడీ గారు తన కోసమే బ్రతకడం లేదు ,దేశం కోసం రాబోయే తరల కోసం, ధర్మం కోసం బతుకుతున్నారు అన్నారు.కానీ కాంగ్రెస్ పార్టీ మరియు వారి కూటమి పార్టీలు వారి కుటుంబం కోసం, కుటుంబ పాలన కోసమే బ్రతుకుతున్నారు అన్నారు. ఏలాంటి అల్లర్లు లేకుండా ఒక్క తుపాకీ తూటా కూడా పేలకుండా రామమందిరాన్ని మోడీ గారు నిర్మిస్తే కేవలం అల్లలు సృష్టించాలనే దురు, అవి అక్షంతలు కాదు రేషన్ బియ్యం అని కాంగ్రెస్ సంబంధించిన ఒక మంత్రి అవహేళన చేయడం వారికి సిగ్గుచేటు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్పాటై 6నెలలు కాకముందే త్రిబుల్ ఆర్ టాక్స్ పేరుతో తెలంగాణలో ప్రజా సొమ్ము దోచుకుని, కేవలం వారి స్వార్ధ ప్రవచనాల కోసం రాహుల్ గాంధీ గారికి వారి జాతీయ కాంగ్రెస్ పార్టీకి తరలిస్తు ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ దోచుకుంటుంది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారం చేపట్టి ఆరు నెలల్లో ఆ గ్యారంటీలను నెరవేర్చక ఫెయిల్ అయిందని అన్నారు. పండించిన పంటకు 500 బోనస్ సంగతి, రుణపాపీ ఎప్పుడు ,అలాగే మహిళలకు ఫ్రీ గ్యాస్ కనెక్షన్ ,3 తులం బంగారం ఇస్తానన్నారు అవి ఏవి. ఉద్యోగులకు అండగా ఉంటామని నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని అధికారం చేపట్టి ఇంతవరకు ఒక నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఒక విధంగా పార్లమెంట్ ఎలక్షన్లలో అత్యధికంగా ఓట్లు బిజెపి పార్టీకే రావడం జరిగినది నైతికంగా తెలంగాణలో బిజెపి పార్టీ దగ్గర గెలుపు అన్నారు .రేవంత్ రెడ్డి మీరు కానీ మీ మంత్రులు గాని రామ మందిరం గూర్చి మాట్లాడిన మోడీ గురించి మాట్లాడిన హిందువుల గురించి మాట్లాడిన అక్షింతల గురించి మాట్లాడిన పార్లమెంట్ ఎన్నికలలో జరిగిన విధంగా తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెడుతారు అన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలో ఏర్పడే ప్రభుత్వం మీరు అవహేళన చేసిన అక్షింతల పార్టీది, జైశ్రీరామ్ పార్టీది ,ధర్మబద్ధమైన పార్టీది, హిందువుల పార్టీది అని తెలియజేశారు. మరొకసారి రైతులకు మహిళలకు యువకులకు ఉద్యోగస్తులకు కళాకారులకు అన్ని రకల ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలరపు పర్వతాలు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి తాత రవి అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ తంగెడ రాజేశ్వరరావు పోల్సాని సంపత్ రావు సంతోష్ రెడ్డి మండల అధ్యక్షులు కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, సంపత్, కారింగుల శ్రీనివాస్ ,కూకట్ల నాగరాజు, కోదటి రమణారావు ,కొప్పుల మహేష్, కౌన్సిలర్ రాజం మహంత కృష్ణ, ఎర్రోళ్ల శ్రీకాంత్ పెంజర్ల రాకేష్ గుడ్ల సతీష్ వేల్పుల రమేష్ పడాల శ్రీధర్ పిట్ట వినయ్ సోడా బాబు పెరక సాగర్ గదాసి సతీష్ పోగుల రాజు హరీష్ ఆవుల శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

## డబుల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

**సూర్య జూలపల్లి**

మండల కేంద్రం నుండి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ బిజెపి నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ బషీరుద్దీన్ కు వినతిపత్రం సమర్పించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు రోజుల్లో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రస్తుత ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని లేని పక్షంలో 10వ తేదీన మండల కేంద్రంలో పెద్దఎత్తున ధర్నా,రాస్తారోకో చేపట్టి ఆందోళనలు ఉధృతం చేస్తామని బిజెపి నాయకులు అమరగాని ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దల్ల ఐలయ్య, కంచి శ్రీనివాస్,మేరుగు కనకయ్య,గుంటి అశోక్,బొమ్మనవేని రాజయ్య, తోటపల్లి సతీష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.


## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**సూర్య ఓదెల**

మండలంలోని జీలకుంట గ్రామంలో గురువారం రాత్రి విద్యుత్ షాక్ తో గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్ రెడ్డి మృతి చెందారు. గురువారం రాత్రి వర్షం చేత ఇంట్లో విద్యుత్ రావడం లేదని కర్ర తో ఇంటి ముందు ఉన్న విద్యుత్ పోల్ పైన కార్బన్ వచ్చిందేమోనని వైర్లను కదిలిస్తున్న తరుణంలో విద్యుత్ షాక్ వచ్చి వెంటనే కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు చూసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. స్థానిక ఎస్సై అశోక్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.

## ప్రధానోపాధ్యాయులుగా బన్నాజీకి మళ్లీ బాధ్యతలు

**సూర్య, వేములవాడ**



రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మండల విద్యాధి కారిగా జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్ హెడ్ మాస్టర్ గా విధులు నిర్వహించిన భూక్యా బన్నాజీ ఎన్నికల నియ మావళి ఉల్లంఘించిన నేపథ్యంలో అతన్ని బాధ్యతల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. మళ్లీ తిరిగి బన్నాజీని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్ హెడ్ మాస్టర్ గా నియమిస్తూ శుక్రవారం వరంగల్ స్కూల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనా రాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడ మండల విద్యాధికారిగా, సిరిసిల్ల ఎంఈఓ గా పనిచేస్తున్న రఘుపతికి బాధ్యతలు అప్పగించినా నేటి వరకు బాధ్యతలు తీసుకోలేదు.

## సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా

**సూర్య సిరిసిల్ల టౌన్**



వారం రోజుల వరకు గ్రామపం చాయతీ కార్మికుల పెండింగ్ వేత్తనాలు అందించకుంటే విధు లను బహిష్కరిస్తామని సిఐటి యు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేపట్టి ఏవోకు వినతిపత్రం అందించారు.గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కూరపా టి రమేష్ హాజరై మాట్లాడుతూ గ్రామాలను పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచడం కోసం తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా కష్టపడి పని చేస్తూ సేవలందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం,అధి కారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.కలెక్టర్ జిల్లాలో పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 18000 అందిం చే విధంగా మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి,ప్రమాద బీమా సౌకర్యం , ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించి ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే కార్మికులం దరూ సమ్మె లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి,కార్యదర్శి కోడం రమణ, అన్నల్దాస్ గణేష్లి,ఎలిగేటి రాజశేఖర్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్యాల నర్సయ్య,లింగంపల్లి కృష్ణవేణి,బుర్ర శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య, అంజయ్య,మహేష్,నర్సయ్య,శ్రీనివాస్ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## ఎరువులు,విత్తనాలకు కొరత లేదు

### -అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**సూర్య సిరిసిల్ల టౌన్**



వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు.ఖ రీఫ్ సీజన్ సాగుపై జిల్లాలోని ఏఓలు,ఏఈఓలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ ఏఓలు,ఏఈఓలు తమ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండాలని,సాగులో మెలకువలు అందించాలని సూచించారు.రైతులు విత్తనాలు,ఎరువులు కొనుగోలు చేసిన తరువాత కచ్చితంగా రసీదు తీసుకోవాలని పేర్కొన్నారు. లూజ్ విత్తనాలు,ఎలాంటి గుర్తింపు లేని వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని స్పష్టం చేశారు.ప్రభుత్వ,వ్యవ సాయ శాఖ గుర్తింపు ఉన్న పత్తి విత్తనాలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు తమ పరిధిలోని దుకాణాల్లో నిత్యం తనిఖీ చేయాలని,స్టాక్ రిజిస్టర్,నిలువలు సరి చూసుకోవాలని ఆదేశించారు.నిబంధనలకు విరుద్ధంగా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని,పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.జిల్లాలోని రైతులు విత్తనాలు, ఎరువుల విషయంలో ఆందోళన పడవద్దని, వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకు విత్తనాలు,ఎరువులు వాడాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ బ్యాంక్ పాలకవర్గ విజయోత్సవ ర్యాలీ

**సూర్య సిరిసిల్ల టౌన్**



ముచ్చటగా మూడవసారి సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తన సత్తాను చాటా డంతో పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది. వరుసగా మూడు పర్యాయములు బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించి చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంటూ వస్తుంది ఇదే తరుణంలో సహకార బ్యాంక్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది అభ్యర్థులు డైరెక్టర్లుగా విజయం సాధించగా శుక్రవారం ఆ పార్టీకి చెందిన రాపిల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షులుగా వైస్ చైర్మన్ గా అడ్డగట్ల మురళి ఎన్నికయ్యారు.పట్టణంలో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు.సిరిసిల్ల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు జిందం చక్రపాణి,రాష్ట్ర నాయకులు గూడూరు ప్రవీణ్,బొల్లి రామ్మోహన్, జెడ్పి చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు పూలమాలను, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో డిజె సౌండ్ల మధ్య విజయోత్సవ ర్యాలీ ఉత్సాహభరితంగా నిర్వహించారు.టిఆర్ఎస్ నాయకులు నృత్యాలు చేస్తూ సంబరాలు నిర్వహించారు.బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గంలో మరోసారి పార్టీ సత్తాను చాటడంతో కార్యకర్తల్లో ఆనందోత్సవం వెల్లి విరిసింది.వరుస ఓటమిలతో కృంగిపోతున్న టిఆర్ఎస్ కు సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికలు కొంత ఊరటను కలిగించింది.దీంతో కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహంతో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. అర్బన్ బ్యాంక్ నుండి ప్రారంభమైంది విజయోత్సవ ర్యాలీ గాంధీ చౌక్ అంబేద్కర్ నేతల చౌరస్తా మీదుగా జోరుగా సాగింది.

